J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 49 7.5.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## స్పష్టమైన సంకేతాలనిచ్చిన తాజా ఎన్నికలు

# ప్రాంతీయ నినాదానికే ఓటు.. జాతీయ వాదానికి పోటు!



బెంగాలీయులకు 'దీదీ'పై తగ్గని మమత



తమిళనాట 'స్టాలిన్' ఉదయించెన్



కేరళలో 'పినరయి విజయన్' పునర్విజయం



పుదుచ్చేరిలో రంగస్వామికే పట్టం

***బెం**గాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అస్సాంలలో జరిగిన ఎన్నికల ఫలితాలు చాలా మంది ప్రజాస్వామిక ప్రియులకు సంతృప్తినిచ్చి ఉంటాయి. ముఖ్యంగా ప్రాంతీయ నినాదాన్ని బలంగా వినిపించిన ఈ ఫలితాలు, ఈ దేశంలో విస్తృతమైన 'స్థానిక ప్రజాభిప్రాయా'నికి, జనాభీష్టానికి కాలం ఇంకా చెల్లిపోలేదన్న కొద్దిపాటి భరోసాను కలిగించాయి. ఒక్క అస్సాం తప్ప, బీజేపీ మరెక్కడా గెలవదు అని మరాఠా సూపర్‌మ్యాన్ శరద్‌పవార్ చాలా రోజుల క్రితమే జోస్యం చెప్పారు. ఫలితాలు కూడా అలాగే వచ్చాయి.*

ముందుగా తమిళనాట కొస్తే, ఈ రాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో రెండు విశేషాలు ఉన్నాయి. ఒకటి, డీఎంకే విజయం. స్థానికంగా తమిళుల మనోభావాలకు అద్దం పట్టే పార్టీ డీఎంకే. ఇప్పటివరకూ అధికారం అనుభవించిన అన్నా డీ.ఎం.కే నేతలకు ప్రజలు ఆ అధికారాన్ని నేరుగా అప్పచెప్పలేదు. జయలలితకు అప్ప చెప్పారు. ఆమె మరణంతో ఆ అధికారం వీరికి బదిలీ అయ్యింది. అందువల్ల, వారివద్ద నుంచి ప్రజలు ఆ అధికారాన్ని లాగేసి, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌కు అప్పగించారు. 68 సంవత్సరాల స్టాలిన్‌ను తమిళనాడు ప్రజలు దాదాపు 42 సంవత్సరాలుగా చూస్తున్నారు. తండ్రి చాటునో... తండ్రి తరపునో అధికార బాధ్యతలు నిర్వహించిన తీరును ప్రజలు చూశారు. అందువల్ల అటు జయలలిత గానీ, ఇటు కరుణానిధి గానీ అందుబాటులో లేని ప్రస్తుత పరిస్థితుల్లో స్టాలినే ఉత్తమం అనుకుని, అధికారాన్ని ఆయన సారథ్యం వహిస్తున్న డీఎంకేకు కట్టబెట్టారు. బీజేపీలాంటి జాతీయపార్టీతో అంటకాగిన అన్నాడిఎంకేను కాదని, స్థానిక పార్టీ అయిన డి.ఎం.కే మెడలోనే వరమాల వేశారు.

2 లో

## తిరుపతి పార్లమెంటు ఎన్నికలలో..

# నోట్లియ్య లేదని.. ఓట్లెయ్య లేదు!

3 లో

*తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికకు నోటు పోటు పడింది. ఫలితంగా ఓటుకి చోటు లేకుండాపోయింది. పైసలు తీయకుండా ఫలితాలు సాధించాలనుకున్న పార్టీల కలలు పండలేదు. బ్యాలట్ బాక్సులు నిండలేదు. తిరుపతి పార్లమెంటు నియోజక వర్గంలోని నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఓటర్లు నోటిస్తేనే ఓటేస్తామని చెప్పకనే చెప్పారు.*

**అందుకే ఆశించిన మెజారిటీ రాలేదు**

డా. గురుమూర్తి, ఎంపీ



మెజారిటీ
2,71,592



## సంస్మరణ

సామాన్యులను నాయకులుగా మలచిన
రాజకీయ యోధుడు
పేద, దళిత, బడుగు, బలహీన వర్గాల
జనబాంధవుడు
రాజకీయాలలో తనదైన ముద్రవేసుకున్న
ప్రజానాయకుడు
మాజీ ముఖ్యమంత్రి

**శ్రీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గారు**

స్వర్గస్థులై తేది.09.05.2021 నాటికి
ఏడేళ్ళు గడవనున్న సందర్భంగా
వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**
ఛైర్మెన్, నేదురుమల్లి ఫౌండేషన్

# ప్రాంతీయ నినాదానికే ఓటు.. జాతీయ వాదానికి పోటు!

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాట ఇలా జరుగుతుందని రాజకీయాల పట్ల కనీస అవగాహన కలిగిన వారందరూ రెండేళ్లుగా ఊహిస్తూ వచ్చిందే. అయితే, అసలు ఎవరూ ఊహించని రాజకీయ విశేషం కూడా ఒకటి తమిళనాడులోనే చోటు చేసుకుంది.

## సినిమాలు వేరు.. రాజకీయాలు వేరు

సినీ నటనకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన కమల్‌హాసన్‌కు, మన పవన్‌కళ్యాణ్‌కు కుట్టినట్టే ఒక రాజకీయ క్రిమి ఓ దుర్ముహూర్తాన కుట్టింది. మన పవన్‌కళ్యాణ్‌లాగానే ఆయనా రాజకీయ భ్రమల్లోకి జారిపోయారు. అచ్చం మన పవర్ స్టార్ చెప్పినట్లుగా ఈ తమిళ స్టార్ కమల్‌హాసన్ కూడా మార్పు కోసమే వచ్చానంటూ అరిగిపోయిన రికార్డ్ ఒకటి జనం మీదికి వదిలారు. 'మార్పు కోసం' అనే మాట పదే పదే వింటున్న జనం కూడా విసిగి వేసారిపోయి ఉన్నారు. సినీ నటనలో పెద్దపులుల్లాంటి ఎం.జీ.ఆర్‌ను అక్కడా... ఎన్.టీ.రామారావును ఇక్కడా చూసి, చాలామంది సినీజీవులు వాతలు పెట్టుకోడానికి ప్రయత్నించారు. ఓ సినీ నటుడికి ప్రజలలో అభిమానం పెల్లుబకడానికి దారితీసే నేపథ్యం వేరు... దానిని రాజకీయాల్లో క్యాష్ చేసుకోవాలనుకునే వారి తాపత్రయం, మనస్తత్వం వేరు. ప్రజలు ఈ రెండింటినీ పాలు.. నీరులా వేరుచేసి చూస్తారనడానికి ఉదాహరణే కమల్‌హాసన్‌కు ఎదురైన అనుభవం. ఆయనతో సహా, ఆయన పార్టీ పేరిట పోటీచేసిన ప్రతి ఒక్కరినీ ప్రజలు తిరస్కరించారు. ఆయనకు తప్ప అయన పార్టీ తరఫున బరిలో దిగిన 99 శాతం మందికి డిపాజిట్లు కూడా దక్కలేదు. ఇక్కడా పవన్‌కి ఎదురైన చేదు అనుభవమే కమల్‌కి కూడా ఎదురయ్యింది. అంటే వీరిద్దరూ తమ తమ 'భాషా ప్రాంతాల'లో అత్యంత ప్రజాదరణ, ఫ్యాన్ ఫాలోయింగ్ కలిగిన సినిమా నటులే అయినప్పటికీ, రెండు రాష్ట్రాల ప్రజలూ ఒకేరకంగా ఆలోచించడం ప్రజాస్వామికవాదులకు ఊరట కలిగించే విషయం. సినిమా వేషాల ద్వారా పాపులారిటీ సంపాదించిన వాళ్ళు భవిష్యత్‌లో రాజకీయాల్లోకి రావడానికి ఒకటికి రెండు సార్లు ఆలోచించవలసిన పరిస్థితిని పవన్‌కళ్యాణ్, కమల్‌హాసన్ అనుభవాలు కల్పించాయి. సినిమా అభిమానం... ఫ్యాన్ ఫాలోయింగ్ వేరు, రాజకీయాభిమానం, పొలిటికల్ ఫాలోయింగ్ వేరు, అనే సూక్ష్మం తెలిసినవాడు కాబట్టే, రజనీకాంత్ రాజకీయాల్లో వేలు పెట్టలేదు. పాలిటిక్స్‌లో కాలు పెట్టాలన్న నిర్ణయాన్ని ఆదిలోనే మార్చుకుని తన గౌరవాన్ని కాపాడుకున్నాడు. రాజకీయ దురద తట్టుకోలేకపోతే, రాజ్‌బబ్బర్ ... హేమమాలిని... శతృఘ్న సిన్హా.. అమితాబ్ బచ్చన్, జయప్రద, జయా బచ్చన్, జయసుధ, కోట శ్రీనివాసరావు, మోహన్‌బాబు, బాబూమోహన్, కృష్ణ, రావుగోపాలరావు వంటి చాలా మంది లాగా తామూ ఏదో ఒక పార్టీలో చేరి, తమ సరదా తీర్చుకోవచ్చు.

## కేరళలో కొత్త అధ్యాయం

ఇక, కేరళకు వెడితే ముఖ్యమంత్రి, సీపీఎం నేత పినరయి విజయన్ కేరళ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. ఆయనేమీ గాలివాటు ముఖ్యమంత్రి కాదు. సీపీఎం పార్టీలో కాకలుతీరిన ఇద్దరు యోధులలో రెండవ వారు. మొదటి వారు మాజీ ముఖ్యమంత్రి అచ్యుతమీనన్. అసెంబ్లీలో ఒకే ఒక్క ఓటు మెజారిటీతో 70వ దశకంలో ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని నడిపిన ఘన చరిత్ర ఆయన సొంతం. రాష్ట్రంలోని వామపక్ష ప్రజాస్వామిక కూటమికి ఐదేళ్ళుగా నాయకత్వం వహిస్తున్న76 ఏళ్ల విజయన్ గత ఐదేళ్ళుగా కేరళకు చేసిన నిరుపమాన సేవలను ప్రజలు గుర్తుపెట్టుకొని, మరోసారి పాలనా బాధ్యతలు ఆయనకే అప్పగించారు. మెజార్టీకి, కేరళ అసెంబ్లీలో 71 సీట్లు వస్తే చాలు. కానీ ప్రజలు 99 సీట్లు ఇచ్చి, పాలనలో ఎటువంటి అనిశ్చితీ లేకుండా చేశారు. పినరయికి ఘనమైన పునర్విజయాన్ని ఇచ్చి, ఆశీర్వదించారు.

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయనపై కేంద్రం చేసిన సాము గరిడీలు, పన్నిన అనుచిత వ్యూహాలు, దుష్ప్రచార రాజకీయాలు అన్నీ... ఇన్నీ కావు. వాటిని కేరళ వాసులు ఆ చెవితో విని... ఈ చెవితో వదిలేశారు. చివరకి, జాతీయ పార్టీ అయిన బీజేపీకి కేరళలో ఒక్క సీటూ రాలేదు. కేరళలో వరుసగా రెండోసారి విజయకేతనం ఎగరేసిన తొలినేతగా పినరయి విజయన్ చరిత్రలో నిలిచిపోయారు. ఇది కూడా సంతృప్తి కలిగించే ఫలితమే. 'పని చేసే' ప్రభుత్వ సేవలను ప్రజలు గుర్తుపెట్టుకుంటారు అనడానికి ఇది ఓ ఉదాహరణ. కేరళకు సంబంధించినంతవరకు సీపీఎం స్థానిక పార్టీయే.

## బెంగాల్‌లో 'మమత'పైనే మమత

బెంగాల్ విషయానికొస్తే, కరోనా విలయతాండవం చేస్తూ, కుటుంబాలకు కుటుంబాలను కబళించేస్తూ....ప్రపంచ దేశాలు సైతం భారత్‌లోని దైన్య స్థితికి జాలిపడుతున్న వేళ... చేయవలసిన పని చేయకుండా... శుష్క వాగ్దానాలు, పగటి వేషాలు తమ వద్ద కుదరవని బెంగాల్ ప్రజలు చాటిచెప్పడం కూడా వర్తమాన రాజకీయ గమనంలో ఓ అతి ముఖ్యఘటనగా ప్రజాస్వామిక హృదయాలను సూటిగా తాకింది.

ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రి, కేంద్రమంత్రులు, బీజేపీ అనుకూల సినిమా నటులు బెంగాల్‌పై 'దండ'యాత్రలు చేశారు. బెంగాల్‌లో 'మటువా' అనే వర్గం వారు బాగా ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్నారని, వారికి చెందిన ప్రార్ధనా మందిరం ఒకటి బాంగ్లాదేశ్‌లో ఉందని తెలిసి ప్రధాని నిముషాలలో బాంగ్లాదేశ్ వెళ్లి పూజలు చేసి, దానికి భారీ ప్రచారం కల్పించుకున్నారు.

బెంగాల్‌లో బీజేపీకి సొంత సీన్ లేకపోవడంతో మమత పార్టీకి చెందిన చిన్నా, పెద్ద నాయకులను 'టోకున' లాగేసి టిక్కెట్లు ఇచ్చేశారు. గవర్నర్ ఆఫీస్ నుండి ఎలక్షన్ కమిషన్ కార్యాలయం వరకూ ప్రతి వ్యవస్థను కావలసిన చోట.. కావలసిన విధంగా వాడేశారు. ఐఏఎస్, ఐ.పీ.ఎస్ అధికారులనైతే... మైదాపిండి పిసికినట్టు పిసికేశారు. మోడీ, షాకు ప్రచార సౌలభ్యం కల్పించడం కోసం 292 నియోజకవర్గాల్లోని ఎన్నికలను ఎనిమిది దశల్లో నిర్వహించాలని 'భారతీయ' ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ పోటీ త్రేతాయుగంలోని శ్రీరాముడికీ... కలియుగంలోని తృణమూల్ కాంగ్రెస్‌కీ మధ్యనే అన్నట్టుగా జై శ్రీరామ్ నినాదాలతో బెంగాల్‌ను హోరెత్తించారు. మీడియా నోళ్లు నోట్ల కట్టలతో మూసేశారు. ఇంతగా బెంగాల్‌పై మోహరించిన బీజేపీకి వ్యతిరేకంగా అవతల ఒకే ఒక్క మహిళ. రాజకీయ పోరాటాల్లో అపర కాళికా దేవి. 34 ఏళ్లపాటు బెంగాల్‌ను నిరంకుశంగా, అప్రతిహతంగా, పాశవికంగా పాలించిన కమ్యూనిస్టులను బంగాళాఖాతంలో కలిపేసిన వీరనారి మమతా బెనర్జీ.

బెంగాల్ ప్రజలు బీజేపీ అరాచక మైండ్‌సెట్‌నూ, మమత పోరాట పటిమనూ బేరీజు వేసి చూశారు. బెంగాల్‌పై దండెత్తిన బీజేపీని తరిమేసి, 'భూమి పుత్రిక' మమతా బెనర్జీకే మళ్ళీ బెంగాల్ తాళం చేతులు అప్పగించారు. అంతేకాదు. అర, కొర మెజారిటీ అయితే కర్ణాటక, మధ్యప్రదేశ్‌లో లాగా బెంగాల్ ప్రభుత్వాన్ని కూడా బీజేపీ ఎక్కడ దొంగిలించేస్తుందేమో అన్న భయంతో మూడింట రెండువంతుల మెజారిటీని దీదీకి ఇచ్చి ఆమెపై తమకున్న మమతను చూపించారు. ఇక్కడ మమత.... ఏ కారణం వల్లనైనా... దేశ దురదృష్టం కొద్దీ గనుక ఓడిపోయి ఉంటే భారత ప్రజాస్వామిక ప్రక్రియపై ఏ స్థాయిలో దాడి జరిగేదో కదా అన్న భావానికి లోనైనప్పుడు... వళ్ళు జలదరిస్తుంది. ఆ దురవస్థ నుంచి బెంగాలీయులు దేశాన్ని కాపాడారు. దేశం వారికి రుణపడి ఉంది. అన్నట్టు, తృణమూల్ కాంగ్రెస్ కూడా బెంగాల్‌లో స్థానిక పార్టీనే.

## తిరుపతి ఉపఎన్నిక

తిరుపతి లోకసభ నియోజకవర్గం నుంచి 2019లో ఎన్నికైన బల్లి దుర్గాప్రసాద్ అకాల మరణంతో జరిగిన ఉప ఎన్నికలో, వైసీపీ అభ్యర్థికి రెండు లక్షల డెబ్బై వేలకు పైబడి మెజారిటీ వచ్చింది. కానీ, అంత మెజారిటీ వచ్చిన సంతోషం వైసీపీ నేతల మొహాలలో గానీ, మాటల్లో గానీ ఎక్కడా కనపడలేదు. పైపెచ్చు, పోలింగ్ శాతం 2019తో పోల్చుకుంటే బాగా తగ్గినప్పటికీ, తెలుగుదేశంపార్టీకి గతంలో కంటే లక్ష ఓట్లు పెరిగాయి. అందుకే వైసీపీ ఆత్మావలోకనం చేసుకోవలసిన అవసరాన్ని తిరుపతి ఉప ఎన్నిక ఫలితం సూచిస్తోంది.

## యానాంలో...

యానాంలో జరిగింది ఉప ఎన్నిక కాదు. పుదుచ్చేరి శాసనసభకు జరిగిన ఎన్నికలో భాగమే ఇది. సాంకేతికంగా ఎక్కడో ఉన్న పుదుచ్చేరి అనే కేంద్ర పాలిత ప్రాంత పరిధిలో యానాం ఉన్నప్పటికీ, భౌగోళికంగా తూర్పు గోదావరి జిల్లాలో ఉంది. అటుపక్క కోనసీమ... ఇటుపక్క కాకినాడ. జనాభా కూడా మన తెలుగువాళ్లే. మన కులాలే. కాపు, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య, బీసి, ఎస్సీలే. అందరూ అక్కా.. బావా, పిన్నీ... బాబాయ్, అత్తయ్యా.... మామయ్యా వరసలే. పొలం... పుట్రా అటు కోనసీమ వైపునో.., ఇటు కాకినాడ వైపునో. ఓటర్లు కూడా 37వేల చిల్లర. కాకినాడ టౌన్‌లో (అదేలే... సిటీలో) ఓ మునిసిపల్ డివిజన్‌లో ఉన్నంత జనాభా. అయినా... దానికీ ఓ ఎం.ఎల్.ఏ. నియోజకవర్గం ఉంది. పుదుచ్చేరికి ఇప్పుడు మిగతా నాలుగు రాష్ట్రాలతో పాటు ఎన్నికలు జరిగాయి. కనుక, పుదుచ్చేరిలో భాగమైన యానాంలోనూ ఎన్నికలు జరిగాయి.

మామూలుగా అయితే ఇది మల్లాడి కృష్ణారావు హోమ్ టౌన్. ఇండిపెండెంట్‌గా రెండుసార్లు, కాంగ్రెస్ అభ్యర్థిగా రెండుసార్లు మల్లాడి గెలిచారు. 2016లో గెలిచిన తరువాత పుదుచ్చేరి ప్రభుత్వంలో ఆరోగ్య, పర్యాటక, నీటిపారుదల, ఫిషరీస్, క్రీడల, హస్త కళలు వగైరా ఓ అరడజను శాఖలకు మంత్రి. యానాంలో అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిచిన ఎం.ఎల్.ఏ.గా ఒక రికార్డ్ కూడా మల్లాడి పేరు మీదే ఉంది. యానాం సర్వతోముఖాభివృద్ధికి ప్రధాన కారకుడు మల్లాడి కృష్ణారావు. యానాం అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది మల్లాడి కృష్ణారావు పేరే.

ఎన్నికలకు ముందు పుదుచ్చేరిలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే బీజేపీ కేంద్రపెద్దల 'ప్రజాస్వామికాభిలాష'కు అనుగుణంగా మల్లాడి తన ఎం.ఎల్.ఏ పదవికి, మంత్రి పదవికి ఫట్ మని ఒక్క నిముషంలో రాజీనామా చేశారు. అలాగే మరి కొందరు కూడా మల్లాడి బాట పట్టడంతో, పుదుచ్చేరిలో నారాయణస్వామి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది.

తరువాత, ఇప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యానాం నుంచి మల్లాడి పోటీ చేయలేదు. అత్యంత నిజాయతీపరుడిగా, ప్రజల ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందిన తమిళుడు రంగస్వామిని పుదుచ్చేరి నుంచి యానాం తీసుకొచ్చి పోటీ చేయించారు. నిజానికి, ఆయన గెలుపు నల్లేరు మీద బండిలా సాగిపోవాలి. అభ్యర్థిగా మచ్చలేని మాజీ ముఖ్యమంత్రి ఆయన. పైపెచ్చు యానాం రాజకీయ మాంత్రికుడు మల్లాడి కృష్ణారావు రచన, స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఆయనకు పెట్టని కోట. వేరే రాజకీయ పార్టీ అభ్యర్థి ఎవరూ ప్రత్యర్థిగా లేరు.

దీనికి తోడు, వైసీపీకి చెందిన ఎం.పీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి చెల్లుబోయిన వేణు, ఇతర వైసీపీ నాయకులు రంగస్వామికి మద్దతుగా యానాంలో పెద్దఎత్తున ప్రచారం కూడా చేశారు. మొత్తం ఓట్లు 36,37 వేలే. మల్లాడి కృష్ణారావు కంటిచూపుతో గెలిపించగలరని కేంద్ర బీజేపీ పెద్దలు భావించిన యానాం స్థానంలో రంగస్వామి ఓడిపోయారు. కారణం రంగస్వామి స్థానికుడు కాదు. ఓ 28 ఏళ్ల కుర్రాడు గొల్లపల్లి శ్రీనివాస్ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచాడు. అతను యానాం ఎన్నికల్లో పోటీ చేయడం కూడా ఇదే మొదటిసారి.

రంగస్వామి లాంటి నిరాడంబరుడు, నిజాయతీపరుడు, నిస్వార్థనేత ఓడిపోవడంతో మనసు కొంచెం చివుక్కుమన్నప్పటికీ స్థానిక తెలుగు యువకుడు గెలవడం చాలామందికి సంతృప్తినిచ్చింది.

ఈ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నుంచి నేర్చుకున్న అనేక గుణ పాఠాలు ఏమిటంటే....

- రోటీ, కపడా, మకాన్ ఔర్ కామ్ అనే ఊసు లేకుండా ఓట్లకు బయలు దేరితే కుదరదు.
- పని చేసే ప్రభుత్వాన్ని మాత్రమే ప్రజలు గుర్తుపెట్టుకుని ఆదరిస్తారు.
- సినిమా వేషాలు వేసుకుని బతికే వాళ్ళు...సినిమా లోకానికే పరిమితం కావాలి గానీ, పవిత్రమైన ప్రజా సేవా రంగంలోకి అడుగు పెట్టవద్దని ఓటర్లు తేల్చి చెప్పారు.
- జాతీయ వాదం కంటే ప్రాంతీయ నినాదానికే ప్రజలు ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు.

రాజకీయపార్టీలు ఈ ఎన్నికల ఫలితాలనుంచి ఏమి నేర్చుకుంటాయో...! వేచి చూద్దాం.

# అయిదుగుర్ని మింగేసిన రోడ్డు ప్రమాదం

- సర్పంచ్‌తో సహా నలుగురు మహిళలు దుర్మరణం
- సజ్జాపురం వద్ద దుర్ఘటన



జిల్లాలోని సజ్జాపురం గ్రామం వద్ద ఈనెల 4న రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. నిరుపేదలైన మహిళలను పొట్టనబెట్టుకుంది. ప్రమాదంలో మరణించినవారంతా కూలినాలి పనులు చేసుకునే కష్టజీవులే. వీరితో పాటు గ్రామ సర్పంచ్ కూడా మృతిచెందాడు. నెల్లూరు రూరల్ మండలంలోని సజ్జాపురం వద్ద జరిగిన ఈ దుర్ఘటన జిల్లా ప్రజలను కలచివేసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సజ్జాపురం గ్రామ సర్పంచ్ అప్పకూటి పెంచలయ్య (75) పక్కనే ఉన్న గొల్లకందుకూరులో పుచ్చకాయలు సాగుచేశారు. తోటలోని కాయలను కోసి తెచ్చుకునేందుకు తొమ్మిది మంది స్థానికులను తీసుకుని ఉదయాన్నే ట్రాక్టర్‌లో బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న చేపల కుంటలో పడిపోవడంతో ఈ దుర్ఘటన జరిగిందని సమాచారం. నలుగురు మహిళలతో సహా ఆ సర్పంచ్‌ని కూడా మృత్యువు పొట్టన పెట్టుకుంది. మృతులంతా నెల్లూరు రూరల్‌లోని సజ్జాపురం వాసులే. ఆ సమయంలో ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు మరో పది మంది ఉండగా, ట్రాక్టర్ ట్రాలీలో కూర్చున్న వారు నీళ్ళలో పడిపోవడం, వారిపై ట్రాలీ బోల్తాపడడంతో అయిదుగురు అక్కడికక్కడే మృతిచెందారని తెలుస్తోంది. మృతుల్లో సర్పంచ్‌తోపాటు కిలారు హైమావతి(35), పాతం కృష్ణవేణి(20), నాళి లక్ష్మీకాంతమ్మ(45), తాండ్ర వెంకట రమణమ్మ(18) ఉన్నారు. ట్రాక్టర్‌లో నుంచి పక్కకు దూకిన ముగ్గురితోపాటు ఇంజిన్‌పై కూర్చున్న మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నోట్లియ్యలేదని.. ఓట్లెయ్యలేదు!

మొన్న జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో, ఓటర్లు అన్ని రాజకీయ పార్టీలకు స్పష్టమైన సందేశం ఇచ్చేశారు. తమకు నోట్లిస్తేనే ఓట్లు వేయడానికి వస్తామని ఖరాకండిగా చెప్పేశారు. ఎన్నికల ప్రచార సమయంలో డబ్బులిచ్చి, మందు పోసి బిరియాని పెట్టిన అన్ని పార్టీల సభలకు కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కబెట్టకుండా తండోపతండాలుగా తరలి వచ్చిన జనం, ఏప్రిల్ 17వ తేదీ జరిగిన పోలింగుని మాత్రం లైట్ తీసుకున్నారు.

2019 సార్వత్రిక ఎన్నికలలో పోలైన ఓట్లకన్నా 15శాతం తక్కువగా ఈ ఉప ఎన్నికలో ఓట్లు పోలయ్యాయి. అందుకు కారణం ఓటర్లు ఊహించినట్లుగా నోట్ల పంపకం జరగకపోవడమే. ఓటర్లని సంతలో పశువుల్ని చేసినట్లుగా చేసి కొంటున్న సంప్రదాయానికి మొన్నటి ఉప ఎన్నికలలో అధికార పార్టీ చెక్ పెట్టడమే. ఇది ఏ ఒక్కరి మాటో, ఏ కొందరి అనుమానమో కాదు. అన్ని రాజకీయ పార్టీలు, ఆయా పార్టీల నాయకులతోపాటు రాజకీయ పరిశీలకుల అభిప్రాయం.

బల్లి దుర్గాప్రసాద్ దివంగతులైనప్పటి నుండి తిరుపతి పార్లమెంటుకి బరిలో దిగబోయే అభ్యర్థి గెలుపు గురించి ఎవరూ మాట్లాడుకోలేదు, మెజారిటీ గురించే చర్చించుకున్నారు. అంతటి స్థాయిలో వైసిపి శ్రేణుల్లో నమ్మకం ఏర్పడింది. మెజారిటీ 5లక్షలు ఖాయం, ఆ పైన ఎంత..? అన్నది మాత్రమే వారి ఆలోచన. ప్రతిపక్ష పార్టీల వారికెవరికీ డిపాజిట్లు కూడా రావన్నది వారి ధీమా. ఐతే వారి ఊహలన్నీ తారుమారు అయ్యాయి, అంచానాలన్నీ తలక్రిందులయ్యాయి. గత మెజారిటీ కంటే కేవలం నలభై వేలు మాత్రమే సాధించగలిగారు. దీనంతటికీ కారణం డబ్బులివ్వకపోవడమే అన్నది విశ్లేషకుల అంచనా.

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో సైతం ఓట్ల కొనుగోలు జరిగింది. కొన్ని గ్రామాలలో అయితే ఓటు 3 వేల నుండి 6వేల రూపాయలదాకా పలికింది. ఒక్కొక్క చోటైతే మరీ విడ్డురంగా కుటుంబంలో 6 మంది ఉంటే అందరికి కలిపి గుత్తంగా 50 వేలరూపాయలు కూడా ఇచ్చి ఓట్లు కొనుక్కున్నారు. ఆలా అలవాటు పడిన జనానికి అధికారపార్టీ ఈసారి 'నో నోట్ – ఓన్లీ ఓట్' అనడంతో పాపం తిరుపతి ఓటర్లు నీరసించిపోయారు. సరిగ్గా పోలింగ్ తేదీ వచ్చేసరికి వీళ్ళందరికీ కరోనా గుర్తొచ్చింది, పాపం ఇళ్లలో నుండి బయటకు రాలేదు. 15 లేదా 16వ తేదీ నోటు వాసన చూపించుంటే పోలింగ్ శాతం పెరిగి మెజారిటీ కనీసం 3 లక్షలు దాటుండేది. మొత్తానికి తిరుపతి ఉప ఎన్నికలో నోట్లియ్యలేదు కాబట్టి ఓట్లు వెయ్యలేదన్నది స్పష్టమైపోయింది.

## టీడీపీ మేల్కొనుంటే ఇంకొన్ని ఓట్లు పడుండేవి

తెలుగుదేశం చేసిన తప్పిదాల వల్ల కూడా వాళ్లకి ఓట్లు తగ్గాయి, లేదంటే ఇంకా కొన్ని ఓట్లు పెరుగుండేవి. యం.పి.టి.సి, జడ్.పి.టి.సి. ఎన్నికలను బహిష్కరించి తెలుగుదేశం పెద్ద తప్పిదమే చేసింది. ఆ ఎన్నికలలో పాల్గొనుంటే అదే ఉత్సాహాన్ని ఈ ఉప ఎన్నికలో కూడా పార్టీ క్యాడర్ చూపించుండేది. ఆ ఎన్నికలను బహిష్కరించడంతో పార్టీ అధిష్టానంపైనా, అధినాయకత్వంపైనా కార్యకర్తలకు, పార్టీ ద్వితీయశ్రేణి నాయకులకు నమ్మకం పోయింది. ఎక్కడివాళ్ళు అక్కడే గప్‌చిప్ కావడంతో తెలుగుదేశానికి ఓట్ల శాతం తగ్గిందన్నది కూడా రాజకీయ మేధావుల విశ్లేషణ. బాబు అండ్ కో కూడా డబ్బులు తీయకపోవడంతో అటునుండి కూడా కొంత స్పందన తగ్గిందన్న మాట కూడా వినిపిస్తోంది. ఏదిఏమైనా భవిష్యత్తు ఎన్నికలలో నోటుకి ప్రాధాన్యత ఇవ్వకపోతే ఓటుకి కూడా చోటుండదన్న విషయం అన్ని పార్టీలవారికీ ఈ ఉప ఎన్నికతో అర్ధమైపోయిందన్నది మాత్రం నిజం.

ఇకనైనా అన్ని పార్టీలవాళ్ళు ఒక తాటిపై నిలిచి, గెలిచాక ఇస్తామని ఆశ చూపుతున్న ఉచిత తాయిలాలతో పాటు ఎన్నికకు ముందే చేస్తున్న నోట్ల పందేరానికి కూడా స్వస్తి చెపితే, అప్పటికైనా ఎన్నికలు రాజ్యాంగ బద్ధంగా జరుగుతాయేమో ఒక్కసారి ఆలోచించుకుంటే బాగుంటుంది.

# విజయసారధులతో సి.యంని కలసిన డాక్టర్ గురుమూర్తి, యం.పి



తనకు వరమిచ్చి, రాజకీయ జీవితాన్ని ప్రసాదించి, పెద్దల సభకు పంపించిన తన దైవం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని తిరుపతి పార్లమెంటు సభ్యుడు డాక్టర్ గురుమూర్తి, తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశాడు. మే 3వతేదీ సోమవారం, తన విజయానికి సహకరించిన పార్టీ నాయకులతో సహా అయన సియంని కలసి కృతజ్ఞతలు తెలిపాడు. పార్టీ పెద్దలు వై.వి.సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, శాసనసభ్యులు కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కిలివేటి సంజీవయ్యలతో పాటు పార్టీ నేతలు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, భూమన అభినయి రెడ్డి, యం.ఆర్.సి.రెడ్డి కూడా సియంని కలిసిన వారిలో వున్నారు.

# గాల్లో ప్రాణాలు.. క్యూలో శవాలు

## ఆసుపత్రులు హౌస్‌ఫుల్ | శ్మశానాల్లో నో వేకెన్సీ




## భయపడవద్దు.. మనో స్థైర్యమే ముద్దు

కరోనా రెండవ వేవ్ కర్కశంగా వుంది. నిర్ధాక్ష్యంగా ప్రాణాలను బలిగొంటోంది. ఈ రెండవశ్రేణి ముఖ్యంగా యువతపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తోంది. ఆసుపత్రులన్నీ హౌస్‌ఫుల్ బోర్డులతో దర్శనమిస్తుంటే, మహాప్రస్థానాలు(స్మశానాలు) నో వేకెన్సీ అంటున్నాయి. ఈ వార్తలను టివీలు, పత్రికలూ ప్రధాన శీర్షికలతో చూపిస్తున్నాయి. కరోనా రాని వారిని సైతం మానసిక వత్తిడితో ఆసుపత్రుల పాలయ్యేలా చేస్తున్నాయి.

ఇప్పుడు ప్రతి ఒక్కరు తెలుసుకోవలసింది ఒక్కటే. ఇది మనందరం సంయమనం పాటించాల్సిన సమయం. ప్రతిఒక్కరు గుండె నిబ్బరంతో, ఆత్మస్థైర్యంతో వ్యవహరించాల్సిన తరుణం. ఇప్పుడు మన ప్రాణాలు మన చేతుల్లోనే వున్నాయి. ఈ మహమ్మారిని ఎదుర్కొనే ఆయుధం మన దగ్గరే వుంది. సామాజిక మాధ్యమాల్లో హోరెత్తుతున్నట్లుగా సామాజిక దూరం – మాస్కు – శానిటైజర్(ఎస్.యం.ఎస్.)లని వాడుతూ వ్యాధి మనజోలికి రాకుండా నిరోధించుకోవడమే ప్రధమ కర్తవ్యం.

ఒకవేళ వస్తే...

ఒకవేళ మనల్ని వెతుక్కుంటూ ఈ మాయదారి వ్యాధి వస్తే అధైర్య పడవలసిన అవసరం లేదు. పాజిటివ్ వచ్చిందనగానే ఆసుపత్రులకు పరిగెత్తాల్సిన ఆవశ్యకత అంతకంటే లేదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది


11లో




## 'ప్రభా'తం

# ముంచుకొస్తోన్న 'మూడో' ముప్పు

ప్రతిరోజూ దేశంలో లక్షలాదిగా కరోనా కేసులు, మరణాలు పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రపంచంలోని కరోనా మరణాల్లో మన దేశం ఇప్పటికే నాలుగోస్థానానికి చేరుకుంది. మరోవైపు ప్రపంచానికి కరోనా మూడోదశ ముప్పు కూడా పొంచివుందని. కరోనా కొత్త వేరియంట్లతో కోవిడ్ ముంచుకొస్తుందనే హెచ్చరికలు కూడా వస్తున్నాయి. ఇలా ఎన్ని వేరియంట్‌లతో కరోనా రూపం మార్చుకుంటూ విరుచుకుపడుతుందో, ఎన్ని 'వేవ్'లుగా వచ్చి మానవాళిని కబళిస్తుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైనా మేల్కొని ప్రతి ఒక్కరూ టీకా వేసుకోవాలి. ప్రభుత్వాలు, ప్రజలు అంతా కలసి కరోనా కట్టడికి కృషిచేయాలి. ఇదే అందరి తక్షణ కర్తవ్యం!...



ఒక్కోసారి అంతే. మన నిర్లక్ష్యమే మన కొంపను నిలువునా ముంచేస్తోంది. అంతా అయ్యాక.. మనల్ని చూసి మనకే అయ్యో అనిపిస్తుంది. కరోనా విషయంలో మనదేశం పరిస్థితి ఇప్పుడు ఇదే. కరోనా మాయలమారి అని తెలిసినా మలిదశలో దాన్ని అలక్ష్యం చేయడంతో అది మళ్ళీ విజృంభించి లక్షలాది మంది ప్రాణాలను బలితీసుకుంటోంది. తొలిసారి కరోనా వచ్చినప్పుడు ప్రధాని మోదీ సారధ్యంలోని కేంద్రప్రభుత్వం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడంతో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. ప్రపంచమంతా కరోనా విలయతాండవం చేస్తోంటే మనదేశంలో కరోనా కట్టడిని చూసి ప్రపంచదేశాలు విస్మయం చెందడమే కాక, భారత్ దీక్షాదక్షతలను కొనియాడాయి. అదేమి దురదృష్టమో కానీ, ఏడాది కూడా తిరక్కముందే సీన్ రివర్స్ అయింది. కరోనా తిరగబడి రెండోదశలో తన ప్రతాపం చూపడం మొదలెట్టింది. అయినా అప్పుడు కూడా ఎవరూ దానిని పెద్దగా పట్టించుకోలేదు. ఆ ఉదాసీనత వల్లనే ఇప్పుడు లక్షల్లో కోవిడ్ బాధితులు అల్లాడిపోతున్నారు. దీనికి ప్రధాన కారణం రెండోదశలో కేంద్రం సరైన నిర్ణయాలు తీసుకోకపోవడమేనన్నది అందరి ఆవేదన. కరోనా ప్రజల ప్రాణాలు తీస్తూ ఉంటే దాని నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇంతటి ఘోరానికి దారితీస్తోందన్నది సర్వత్రా వినపడుతున్న మాట. పైగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో పెద్దసంఖ్యలో ప్రజల్ని సమీకరించి సభలు పెట్టేలా చేయడం, కోట్లాదిమంది కుప్పలుతెప్పలుగా ఒకే చోటికి వచ్చి చేరే కుంభమేళాల వంటివాటికి అడ్డు చెప్పకపోవడం, 'భౌతికదూరం' అనే మాటను గంగ పాలు చేయడం, ఎవరిపాటికి వారు ఇష్టంవచ్చినట్లుగా సభలు సమావేశాలు పెట్టుకునే అవకాశాలు కల్పించడం, కరోనా ఇక రాదనే అనుకోవడం, ఇలా ఎన్నో కారణాలు..చివరికి ప్రజల ప్రాణాలమీదికి తెచ్చాయని దేశమంతాగగ్గోలుగా ఉంది. తొలిదశ కరోనాను ఎంతో ధైర్యంతో అడ్డుకునేందుకు ఎంత కష్టమైనా ప్రజలు ఒక్కతాటిపై నిలబడి ప్రభుత్వాలు ఏం చెప్తే అది చేసి, ఆ రాకాసిని నిలువరించాయి. ఇప్పుడు అలా చెప్పేవారూ లేరు..చేసేవారూ లేరు అన్నట్లుగా తయారైంది పరిస్థితి. ఎవరిష్టం వారిదన్నట్లుగా నేతల పాటికి నేతలు రాజకీయాల్లో ఆధిపత్యాల కోసం తలమునకలై ఉంటే, ఇదే సందనుకుని కరోనా రాకాసి మాత్రం ప్రజల్ని కరకరా నమిలి మింగేస్తూనే ఉంది. ప్రతిరోజూ మనదేశంలో లక్షల సంఖ్యలో పెరిగిపోతున్న కరోనా కేసులను చూసి ఇప్పుడు ప్రపంచమే విస్తుపోతోంది. ప్రస్తుతం రోజుకు కనీసం నాలుగు లక్షల మందికి పైగానే ఈ మహమ్మారి బారిన పడి బతకలేక చావలేక నానా యాతనలు పడుతున్నారు. లక్షలాదిమంది నిత్యం పిట్టల్లా రాలిపోతున్నారు. రోజుకు దాదాపు నాలుగు లక్షలమంది దాకా కరోనా బారినపడుతున్నారంటే దేశంలో ఈ వ్యాధి ఎంత తీవ్రంగా విజృంభిస్తోందో తెలుస్తుంది. ప్రపంచంలోని కరోనా మరణాల్లో మనదేశం ఇప్పటికే నాలుగోస్థానానికి చేరుకుంది కూడా. ఇప్పుడిప్పుడే దేశంలో కొన్నిచోట్ల లాక్‌డౌన్లనీ, కర్ఫ్యూలనీ అంటున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరవడం మంచిదే. అయినా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉంది పరిస్థితి. ఇదిలావుంటే మరోవైపు..ఈ మాయలమారి ఇంతటితో ఆగేట్లు కూడా లేదు. ప్రపంచానికి కరోనా మూడోదశ ముప్పు కూడా పొంచివుందని నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నారు. దీంతో మనదేశం మరింతగా జాగ్రత్తపడాల్సి ఉంది. కానీ ఆ జాగ్రత్తలేమీ కనిపించడం లేదు. రెండో దశనే కట్టడి చేయలేక లబోదిబో మంటుంటే.. ఇక మూడో దశ వస్తే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో చెప్పలేం! అంతటితో అయిపోలేదు, కరోనా కొత్త వేరియంట్లతో నాలుగో దశ (ఫోర్త్ వేవ్) కోవిడ్ ముంచుకొస్తుందనే హెచ్చరికలు కూడా వస్తున్నాయి. ఇలా ఎన్ని వేరియంట్‌లతో కరోనా రూపం మార్చుకుంటూ విరుచుకుపడుతుందో, ఎన్ని 'వేవ్'లుగా వచ్చి కరోనా మానవాళిని కబళిస్తుందో అర్థం కాని పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే పదహారు కోట్లమందికి పైగానే ఈ వ్యాధితో విలవిల్లాడిపోతున్నారు. మరో ముప్పైరెండు లక్షలమందికి పైగానే ప్రాణాలు కోల్పోయారు. దీంతో, మాస్కు పెట్టుకోవడం, భౌతికదూరం పాటించడం, ప్రతి ఒక్కరూ టీకా వేసుకోవడం వంటివి కరోనాని కట్టడి చేసేందుకు ముఖ్యమైన మూడు సూత్రాలుగా ప్రపంచ దేశాలన్నీ జాగ్రత్తపడుతున్నాయి. అయితే, మన దేశంలోనే పరిస్థితే మరీ ఘోరంగా.. భయానకంగా ఉంది. ఈ దుస్థితిలో టీకా ఒక్కటే కరోనాని నిరోధించగలదని నిపుణులు చెప్తున్నారు. అయినా.. మన దేశంలో ఇంకా కోట్లాదిమంది టీకా వేసుకునే పరిస్థితి లేకపోవడం ఎంతో విచారకరం. ఈ విపత్కర స్థితిలో దేశంలో టీకా కొరత ఏర్పడడం మరో విషాదం. 'భారత్‌లో ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో వ్యాక్సినేషన్ చాలా చాలా ముఖ్యం. ఈ మహమ్మారి వ్యాధి వ్యాప్తికి వ్యాక్సినేషన్ ఒక్కటే విరుగుడు.. ప్రతిఒక్కరు టీకా వేసుకోవడం అత్యంత కీలకం'.. అని అమెరికా ప్రఖ్యాత వైద్యనిపుణుడు ఫౌచీ ఇటీవల భారత్‌నుద్దేశించి అన్నారు. ఇకనైనా మేల్కొని జరిగిన పొరపాట్లు సరిదిద్దుకోవాలి. కరోనాని తరిమికొట్టేందుకు యుద్ధప్రాతిపదికపై టీకా కార్యక్రమాన్ని ప్రభుత్వాలు ముమ్మరం చేయాలి. రెండోదశ కరోనా విజృంభణ నుంచి వెంటనే ప్రజల్ని కాపాడడమే కాక, దేశంలో 'థర్డ్ వేవ్' ముప్పు రాకుండా చూడాలి. ఎంతటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు దేశం సన్నద్ధం కావాలి. అందుకు కేంద్రం, రాష్ట్రాల్లోని ప్రభుత్వాలే కాదు, ప్రజలంతా సహకరించాలి. అందరూ ఏకమై కరోనాను నిలువరించాలి. ఇదే ఇప్పుడు మనందరి ముందున్న తక్షణ కర్తవ్యం!....

### రంగస్థల నటుడు, దర్శకుడు..

## గిద్దలూరు చంద్రశేఖరయ్య ఇక లేరు



ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, జిల్లాలో ఎందరో కళాకారులకు మార్గదర్శకుడైన గిద్దలూరు చంద్రశేఖరయ్య గతనెల 29వ తేది రాత్రి మృతిచెందారు. జిల్లా సాంఘికనాటక రంగంలో ఆయనో ఆణిముత్యంగా వెలుగొందారు. ఎన్నో పరిషత్తుల నుంచి ఉత్తమ అవార్డులను సాధించి నాటకరంగంలో నెల్లూరుసీమ కీర్తిని రెపరెపలాడించారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల పాటు ఆయన నాటకరంగంలో ఉంటూ తనదైన విలక్షణమైన నటనతో అందరి ప్రశంసలందుకోవడమే కాక, ఎంతోమంది వర్ధమాన కళాకారులను మేటి నటులుగా తీర్చిదిద్దారు. ఆయన స్వస్థలం గూడూరైనా 1970 ప్రాంతంలో ఆయన నెల్లూరుకు వచ్చి స్థిరపడ్డారు. మరో మొహంజొదారో, జగన్నాథ రథచక్రాలు, ఎండమావులు, సమాధి కదుతున్నాం చందాలివ్వండి.. వంటి ఎన్నో విశిష్టమైన నాటకాల్లో ఆయన నటన అద్వితీయం. ఏ పాత్రనైనా అవలీలగా పాత్రోచితంగా నటించే అద్భుతమైన కళాకారులాయన. చంద్రశేఖరయ్య మృతి నాటక రంగానికి తీరని లోటని విచారం వ్యక్తం చేస్తూ నెల్లూరులోని అనేకమంది రంగస్థల నటులు, కళాకారులు ఆయనకు తమ కన్నీటి నివాళులర్పించారు.

## మేకప్‌మ్యాన్ షరీఫ్.. కన్నుమూత



ప్రముఖ మేకప్ కళాకారుడు ఎస్‌కె అబ్దుల్ షరీఫ్ (71) మే 1వ తేది రాత్రి నెల్లూరులో కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవారు. తన అద్వితీయమైన కళాప్రతిభతో రంగస్థల రంగంలో మేకప్ కళాకారుని (రూపశిల్పి)గా ఆయన రాష్ట్రవ్యాప్త ఖ్యాతినందుకున్నారు. దాదాపు అయిదు దశాబ్దాలకు పైగానే ఆయన రంగస్థలానికి ఎనలేని సేవలందించారు. జిల్లాలో ఏ నాటకం, లేదా నాటిక ప్రదర్శించాలన్నా వారికి మేకప్‌మ్యాన్ షరీఫే. పాత్రకు తగ్గట్టుగా మేకప్ వేయడంలో ఆయన అందెవేసిన చేయి. ఉత్తమ మేకప్‌ఆర్టిస్ట్‌గా ఆయనెన్నో అవార్డులు, ప్రశంసలందుకున్నారు. నెల్లూరు నాటకరంగానికి ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదంటూ జిల్లావ్యాప్తంగా రంగస్థల కళాకారులు, అభిమానులు ఆయన మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## 'మనలో మాట' సూటిగా.. ఘాటుగా ఉంటోంది




'లాయర్' వారపత్రికలో కొన్నాళ్ళుగా వస్తున్న 'మనలో మాట' చదువుతుండా. రాసే అంశానికి సంబంధించిన చారిత్రిక సమాచారం, విమర్శ జోడుగుర్రాలుగా దౌడుతీస్తూ చదివించే గుణాన్ని కలిగి, ముందు 'మనలో మాట' చదువుదాం అని పింపజేస్తున్నది. రచనలోని శైలి మరింత ఉత్కంఠతో ఉండి చదువరులు ఆలోచించి అర్థం చేసుకునేట్లుగా సాగుతున్నది. కత్తి, కలం అవడు కానీ, కలం కత్తి అవగలదు. బోగాది వెంకటరాయుడు గారి కలం అట్లయింది. తన కలంలో సురేకారాన్ని దట్టించి వివిధ రాజకీయపక్షాల నాయకుల్ని వ్యంగ్యంగా, సర్మగర్భంగా వెటకారం చేస్తూ అక్షరాల నిప్పుకణికల్ని ఎర్రమిరప కారంతో కలిపి కుమ్మరిస్తున్నారు. ఈ శీర్షిక ఎంతో బాగుంది. ఇటీవల రాసిన భావాల నిప్పురవ్వలు చదివిన ప్రేరణతో స్పందించి ఇన్ని మాటలు రాస్తున్నాను.

తిక్కవరపు సుకుమార్‌రెడ్డి
('ఓ'-నెగటివ్), నెల్లూరు.

## మురికికూపాలతోనే లేనిపోని జబ్బులు

జిల్లాలో అటు నగరాలు, పట్టణాలు..ఇటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎక్కడ చూసినా మురికి, చెత్తాచెదారం కుప్పలు తెప్పలుగా ఉంటున్నాయి. ఈ మురికికూపాలు, అపరిశుభ్రత వల్లనే ప్రజలకి లేనిపోని జబ్బులు వ్యాపిస్తున్నాయి. సైడుకాలువల్లో పూడిక తీసేవారు లేక ఇళ్ళ ముంగిళ్ల చుట్టూ ఉన్న మురుగు కాలువలు మరీ గబ్బుకొట్టిపోతున్నాయి. అధికారులు ఇకనైనా పట్టించుకుని పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగు పరచాలి.

– ఆర్.పద్మావతి, సూళ్ళూరుపేట.

## ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

**అందుబాటులో అగ్నిమాపక సిబ్బంది**

వైద్యశాలల్లో ప్రమాదాలు జరగకుండా చూసేందుకు జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కోవిడ్ వైద్యశాలల్లో అగ్నిమాపక సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. ఆయన ఈనెల 2న నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ దేశంలోని పలు ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని 13 ఫైర్‌స్టేషన్ల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలల్లో సిబ్బందిని విధులకు కేటాయించామన్నారు. ఒక్కో వైద్యశాలలో ఇద్దరు సిబ్బంది ఉంటారని, అగ్నిప్రమాదాలు జరుగకుండా వారు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే మంటలను ఎలా అదుపు చేయాలనే అంశాలపై వైద్యశాలల్లోని సిబ్బందికి అవగాహన కల్పిస్తారని చెప్పారు. ప్రైవేట్ కోవిడ్ వైద్యశాలల సిబ్బందికి కూడా ఈ విషయమై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

## కోవూరు టిడిపి నాయకుడు..శ్రీహరిరెడ్డి మృతి

కోవూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు పెనుమల్లి శ్రీహరిరెడ్డి అనారోగ్యంతో ఈనెల 3న మృతిచెందారు. గత కొద్దిరోజులుగా ఆయన కరోనా బారినపడి ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆయన మృతికి కోవూరు మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి నాయకుడు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

# ఎమ్మెల్యే ప్రసన్న దాతృత్వం

- రూ.2 లక్షల విరాళం, 50 ఆక్సిజన్ సిలిండర్ల వితరణ




కోవిడ్ బాధితుల ఆరోగ్యం కోసం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తనవంతు సేవలందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కోవిడ్ సెకండ్‌వేవ్ తీవ్రస్థాయిలో విజృంభిస్తున్న తరుణంలో దీని ప్రభావంతో కోవూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో వందల సంఖ్యలో ప్రజలు కరోనా వ్యాధి బారినపడుతున్నారు. పదుల సంఖ్యలో బాధితులు మృతిచెందారు కూడా. ఈ నేపథ్యంలో బాధితులందరికీ మెరుగైన వైద్యసేవలను అందించాలని, కరోనాతో ఎవరూ మృతిచెందకుండా తక్షణ వైద్యచికిత్సలు అందించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అధికారులను పురమాయించడమే కాక, బాధితులకు స్వయంగా తనవంతు సేవలందిస్తున్నారు. ఇప్పటికే బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రామచంద్రాపురంలో ఏర్పాటుచేసిన కోవిడ్ కేర్ సెంటర్‌లో దాదాపు 150 బెడ్లను ఏర్పాటు చేయించడంతోపాటు అక్కడ బాధితులకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా 2 లక్షల రూపాయలను అధికారులకు అందచేశారు. దీంతోపాటు బుచ్చిరెడ్డిపాళెంలోని సీహెచ్‌సీలో దాదాపు 5 ఆక్సిజన్ బెడ్లను అధికారుల ద్వారా ఏర్పాటు చేయించి బాధితులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. తమ ట్రస్ట్ ద్వారా నియోజక వర్గంలో కరోనా బాధితులకు దాదాపు 50 ఆక్సిజన్ సిలిండర్లను అందజేశారు. వీటిలో కోవూరుకు 20, బుచ్చిరెడ్డిపాలెంకు 20, ఇందుకూరుపేటకు 10 చొప్పున సిలిండర్లను అందచేశారు. గతేడాది కరోనా మొదటి వేవ్‌లో నియోజకవర్గంలోని 5 మండలాల ప్రజలకు లాక్‌డౌన్ సమయంలో దాదాపు పది లక్షల రూపాయల బియ్యం, సరుకులను అందచేసి పేద ప్రజలకు అండగా నిలవడమే కాక, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా మొదటివేవ్‌లో కరోనా బాధితులకు పదివేల రూపాయలు చొప్పున కూడా ఆర్థికసాయం అందించి తమ సేవాభావం చాటుకున్నారు.

## కోవిడ్ బాధితులకు ప్రాణవాయువులందించిన మన సతీష్‌రెడ్డి



కేంద్ర రక్షణ శాఖ ఆధ్వర్యంలోని డీఆర్‌డీఏ ఛైర్మన్ గుండ్రా సతీష్‌రెడ్డి కరోనా బాధితులకు తక్షణం ఆక్సిజన్ అందించేందుకు తమవంతు వితరణగా ఆత్మకూరుకు వంద ఆక్సిజన్ సిలిండర్లను సరఫరా చేయించి బాధితులకు అండగా నిలిచారు. ఈ ఆక్సిజన్ సిలిండర్లు 2న ఆత్మకూరుకు చేరుకున్నాయి. ఆర్డీఓ ఏ చైత్రవర్షిణి, అభిరాం ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్, మునిసిపల్ కమిషనర్ ఎం. రమేష్‌బాబు, సీఐ వైవీ సోమయ్య ఆ ఆక్సిజన్ సిలిండర్లను కోవిడ్ కేర్ సెంటర్‌కు తరలించి భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చైత్రవర్షిణి మాట్లాడుతూ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చొరవతో ఇప్పటికే ఉన్న ఆక్సిజన్ సిలిండర్లకు అదనంగా భవిష్యత్‌లో బాధితులకు ఇబ్బంది లేకుండా డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి సిలిండర్లను అందజేశారన్నారు. అంతేకాక బాధితులకు అవసరమైన మందులను, 200 రెమిడెసివర్ ఇంజెక్షన్లను మంజూరు చేశారన్నారు. కోవిడ్ బాధితులకు అన్ని సౌకర్యాలతో కేర్ సెంటర్‌లో ఉత్తమ సేవలు అందజేస్తున్నామని, ప్రభుత్వాసుపత్రి, ప్రైవేట్ ఆస్పత్రుల్లోను కోవిడ్ బాధితులకు మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు.

## ఆదివాసీలను ఆదుకున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య



**కరోనా బారిన పడిన ఆదివాసీలను ఆదుకునేందుకు భారత ఉప రాష్ట్రపతి మన వెంకయ్యనాయుడు మానవతా దృక్పథంతో తీసుకున్న శ్రద్ధ వారి ప్రాణాలను కాపాడడమే కాక, వారు తిరిగి క్షేమంగా స్వస్థలాలకు చేరుకునేలా చేసింది.**

కర్నూలుజిల్లాలోని శ్రీశైలం వద్ద ఉన్న యర్రగొండపాళెం నుంచి భారత్ దర్శన్ యాత్రకు వెళ్ళిన 24 మంది ఆదివాసీల్లో 22 మంది కరోనా బారినపడ్డారు. యాత్రలో భాగంగా వారు ఉత్తరాఖండ్‌లో ఉండగా కరోనా సోకింది. ఆ సమాచారం తెలుసుకున్న భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్‌లు వారికి మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకుని వారిని ఆదుకున్నారు. అంతేకాక స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా దీపావెంకట్ 1.5 లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని కూడా అందించి వారు క్షేమంగా తిరిగివచ్చేందుకు సహకరించారు. ఈ నేపథ్యంలో కరోనా బారిన పడిన ఆదివాసీలను ఆదుకున్నందుకు ఆదివాసీల బృందం సభ్యుడు వంశీధర్ కాళిదాసు ఉప రాష్ట్రపతికి, దీపావెంకట్‌కు ఒక ప్రకటనలో తన కృతజ్ఞతలు తెలిపారు.



'భారత దర్శన్' యాత్రలో ఆదివాసీల బృందం




శ్రీ సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి గారు

జననం : 20.08.1936 మరణం : 01.05.2021

శ్రద్ధాంజలి



మమతానురాగాలను మాపై కురిపించి
తన మధురజ్ఞాపకాలను మాకు మిగిల్చిన
మా ఇంటి దైవం

శ్రీ సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి గారు

తే. 01.05.2021ది శనివారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : ఇంద్రసేనమ్మ

కుమారుడు - కోడలు
సిద్ధారెడ్డి సుధీర్‌రెడ్డి - ప్రణతి

మనుమరాలు : శ్రేష్ఠ

నెల్లూరు కబుర్లు

# జిల్లాలో పాక్షికంగా లాక్‌డౌన్

- జిల్లా కలెక్టర్



కరోనా ఉధృతి పెరిగిపోతున్న దృష్ట్యా ఈ నెల 5వతేదీ బుధవారం నుంచి జిల్లాలో పాక్షికంగా లాక్‌డౌన్ అమలుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈ నెల 4న అధికారుల సమావేశంలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ఆర్డీవోలు మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, మునిసిపల్ కమిషనర్లతో సమావేశమై దీనికి సంబంధించి తగు ఆదేశాలు జారీచేశారు. పాక్షిక లాక్‌డౌన్‌లో భాగంగా ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే దుకాణాలు పనిచేయడం జరుగుతుందని, అలాగే ప్రజలు బయట తిరిగేందుకు అనుమతి ఉందని కలెక్టర్ వివరించారు. అత్యవసర సర్వీసులకు మాత్రమే మినహాయింపు ఉంటుందని, 144 సెక్షన్‌ను అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కోవిడ్ నిబంధనలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు పాక్షిక లాక్‌డౌన్‌ను పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా, అత్యవసర సర్వీసులకు ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. వచ్చే రెండు వారాల పాటు లాక్‌డౌన్ సమర్థవంతంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోవిడ్ విధులు నిర్వహించేవారికి మరియు అత్యవసర విధులు నిర్వహించే వారికి పాసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ నిత్యావసర సరుకుల రవాణాకు, పెట్రోలు, డీజిలు, గ్యాస్ సరఫరా రవాణాకు అనుమతి ఉంటుందని, అత్యవసర సేవలు మినహాయించి ప్రజలు ఎవరూ బయట తిరగరాదని తెలిపారు. వీడియో సమావేశంలో జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్, జేసీ (ఆసరా) బాపిరెడ్డి, డిఎఫ్ఓ షణ్ముఖకుమార్, జిల్లా రెవిన్యూ అధికారి చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటాం : ఆర్డీఓ



జర్నలిస్టులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ అన్నారు. మే 1వ తేదీ నెల్లూరు ఎన్టీఆర్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కోవిడ్ వ్యాక్సిన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులకు కావాల్సిన సహకారం జిల్లా యంత్రాంగం అందజేస్తుందని వైద్యశాలలో కావాల్సిన పడకలు, మందులు అన్నీ కూడా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. జర్నలిస్టులకు కావాల్సిన సహాయసహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాశ్, రవితేజ, శేషాచలపతి, నయీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# 'వర్క్ ఫ్రం హోమ్' ఇవ్వండి సార్!..

## కలెక్టర్‌కు ఉద్యోగసంఘాల నాయకుల అభ్యర్ధన

కరోనా విజృంభిస్తూ ప్రజల ప్రాణాలను తీస్తున్న ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కార్యాలయాలకు వచ్చి పనిచేయాలంటే ఎంతో ఆందోళనగా ఉందని, ఉద్యోగులు పెద్దసంఖ్యలో కరోనా బారిన పడుస్తున్న నేపథ్యంలో వెంటనే ఉద్యోగులకు 'వర్క్ ఫ్రం హోం' కేటాయించాలని ఏపి జెఏసి అమరావతి జిల్లా ఛైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెంచురామయ్య జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఫ్రంట్‌లైన్ వర్కర్స్‌గా ఉన్న ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం డిఓపిటి ద్వారా ఉద్యోగులకు 'వర్క్ ఫ్రం హోమ్' సౌలభ్యాన్ని కల్పించిందని కూడా గుర్తుచేశారు.

# పాత్రికేయులకు ఉప రాష్ట్రపతి శుభాకాంక్షలు

ప్రపంచ పత్రికాస్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఈ నెల 3న భారతీయ పాత్రికేయులకు భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఈ సమాచార యుగంలో వాస్తవమైన, సంచలనాలకు తావులేని వార్తలను ప్రజలకు అందించడంలో పాత్రికేయులు పోషించాల్సిన పాత్ర మరింత కీలకం. తప్పుడు సమాచారం నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత వారిదే. కరోనా నేపథ్యంలోనూ ప్రజలకు సరైన సమాచారాన్ని అందజేసి, వారిలో ధైర్యాన్ని నింపిన పాత్రికేయుల పాత్ర అభినందనీయం. పత్రికా స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటూ, ప్రజల సమస్యలను మరీ ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి విషయంలో మీడియా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని ఆకాంక్షిస్తున్నా'నంటూ ఆయన ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు.

# ప్లాస్మాదానానికి ముందుకు రావాలి

- రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖరరెడ్డి

తీవ్రమైన కరోనాతో చికిత్స పొందుతున్న బాధితులను కాపాడేందుకు, కోవిడ్‌ను జయించిన వారు ప్లాస్మాదానం చేసేందుకు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. నెల్లూరులోని మహాయోగ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు పురాణం లోకేష్ తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 3న నగరంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఐదోసారి ప్లాస్మాదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పురాణం లోకేష్ తన ప్లాస్మాదానం ద్వారా ఐదుగురిని కాపాడారన్నారు. అంతేకాకుండా తమ సంస్థలో పనిచేస్తున్న 20 మంది సభ్యుల ద్వారా ప్లాస్మాదానం చేయించాడంటూ లోకేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు బయ్యా ప్రసాద్, ప్రసన్న, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, డాక్టర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్‌కు సీఐ ప్లాస్మాదానం

నెల్లూరులోని సెంట్రల్ క్రైం పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రామగిరి సత్యం కరోనాతో వైద్యం చేయించుకుంటున్న నేపథ్యంలో, ఆయనకు ప్లాస్మా థెరపీ అవసరమని వైద్యులు చెప్పడంతో సీఐడీలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న గిరిబాబు ప్లాస్మా అందజేశారు. కావలిలోని రెడ్‌క్రాస్ భవన్‌లో ప్లాస్మాను సేకరించి నెల్లూరుకు

# ఈతకు వెళ్ళి మునిగిపోయాడు

## పెన్నానదిలో విద్యార్థి దుర్మరణం

స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు పెన్నానదికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయి ఓ విద్యార్థి మృతిచెందిన దుర్ఘటన ఈనెల 3న నెల్లూరులో జరిగింది. నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం నల్లకాలువ ప్రాంతానికి చెందిన రామదాసు, రమణమ్మ దంపతుల కుమారుడు వెంకటకాశి (15) పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 3వ తేది మధ్యాహ్నం స్నేహితులతో సరదాగా పెన్నానదిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. మిగతా పిల్లలు నీటిలో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తూ వెంకటకాశి మాత్రం నీటిలో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ఎంతకీ బయటకు రాకపోయేసరికి తోటి స్నేహితులు పెద్దవాళ్లకు సమాచారం అందించారు. బంధువులు, కుటుంబసభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో నీటిలో గాలించగా బురదలో కూరుకుపోయిన వెంకటకాశి మృతదేహం దొరికింది. కన్నబిడ్డ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# కరోనాతో తహశీల్దారు కన్నుమూత

నెల్లూరు రూరల్ తహశీల్దార్ వెంకటేశ్వర్లు (59) నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో కరోనాతో చికిత్స పొందుతూ ఈనెల 3న మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన 2020 నవంబరులో పదోన్నతిపై నెల్లూరు రూరల్ మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. కరోనా వ్యాక్సినేషన్ కార్యక్రమం సమర్థవంతంగా అమలుచేయడంపై ప్రత్యేక శ్రద్ధచూపారు. మండలంలోని భూ సమస్యలను పరిష్కరించారు. ఆయన మృతి పట్ల ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు ఎంతో ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం మధ్యాహ్నం బోడిగాడితోట స్మశానంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. వెంకటేశ్వర్లు తల్లి వారం రోజుల క్రితమే కరోనాతో మృతిచెందారు. ఇప్పుడు వెంకటేశ్వర్లు కరోనాతో మృతిచెందడంతో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

## జేసీ, ఆర్డీఓల సంతాపం

నెల్లూరు రూరల్ తహశీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు మృతి బాధాకరమని సంయుక్త కలెక్టర్ హరేందిర ప్రసాద్, నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ తదితరులు సంతాపం ప్రకటించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# కర్ఫ్యూకు సహకరించండి

- కమిషనర్ దినేష్‌కుమార్

కరోనా నేపథ్యంలో నగరంలో అమలు చేస్తున్న తాత్కాలిక కర్ఫ్యూకు ప్రజలు సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు వారాల పాటు కర్ఫ్యూ అమలులో ఉండనుందని చెప్పారు. ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని, ఆపైన ఆర్టీసీ, ఆటో లాంటి ఏ ఇతర రవాణా సదుపాయాలకు అనుమతి ఉండదని చెప్పారు. నగరపాలక సంస్థ సూచించిన కేంద్రాల్లో కోవిడ్ వ్యాక్సిన్‌ను ప్రతిఒక్కరూ వేయించుకోవాలని కోరారు.

## ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వోగా వెంకటప్రసాద్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓగా క్షయ నియంత్రణ అధికారి వెంకట ప్రసాద్ ఈనెల 3న నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా ఉన్న అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణలత హోం ఐసొలేషన్‌కు వెళ్ళడంతో ఆ స్థానంలో వెంకట ప్రసాద్‌కు ఆ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వులిచ్చారు.

## దానశీలి వెంకటరామన్ మృతికి సంతాపం



నెల్లూరు కల్లూరుపల్లి వాస్తవ్యుడు, దానశీలి ఆర్.వెంకట్రామన్ ఈ నెల 1న శివైక్యం చెందారు. వీరు పేద బ్రాహ్మణ ఉన్నత విద్య సహాయక ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్‌కు భూరి విరాళమిచ్చారు. మారుమూల ఉన్న మునిసిపల్ పాఠశాలలో, పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో మరియు అంగన్‌వాడీలలో విద్యార్థినీ విద్యార్థులకు భోజన ప్లేట్లు, పుస్తకాలు, పాదరక్షలు, కల్లూరుపల్లి ఉన్నత పాఠశాలలో మంచినీటి ట్యాంకు వగైరాలకు విరాళాలిచ్చి తనవంతు సాయం అందించారు. ఆయన మృతి తమకెంతో బాధను కలిగిస్తోందంటూ జిల్లా బ్రాహ్మణ సంఘం నేతలు గుడ్లదొన వాసుదేవరావు, ఐకే ప్రసాద్, దక్షిణ సింహపురి బ్రాహ్మణ సంఘం నాయకులు ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, బ్రాహ్మణ మహాసభ నాయకులు ఎస్‌వీఎల్ వరప్రసాద్, నాగదేవీ ప్రసాద్, తాళ్లపల్లి రామసుబ్బారావు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆయన మరణానికి చింతిస్తూ ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

# సుధీర్‌బాబు.. హఠాన్మరణం



నెల్లూరులోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం నగరాధ్యక్షుడు గంధం సుధీర్‌బాబు (45) ఈనెల 4న కరోనాతో మంగళవారం మరణించారు. ఆయన మృతికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సంతాపం తెలిపారు. యువజన విభాగంలో ఎన్నో కార్యక్రమాలను నిర్వహించిన సుధీర్‌బాబు మృతి పార్టీకి తీరని లోటని మంత్రి పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

# ఆలయ అర్చకుని శివైక్యం

నెల్లూరు మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థాన ప్రధానార్చకుడు సంపత్‌కుమార్ స్వామి (65) మంగళవారం కన్నుమూశారు. రెండురోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆయనకు పరీక్షలు నిర్వహించగా, కరోనా పాజిటివ్‌గా నిర్ధారణైంది. ఆరోగ్యం క్షీణించడంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా ఆయన మరణించారు. దీంతో ఆలయవర్గాల్లో విషాదం అలముకుంది.

# బీజేపి నాయకుడు గడ్డం లక్ష్మీనారాయణ మృతి బాధాకరం



భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకుడు గడ్డం లక్ష్మీనారాయణ మృతి ఎంతో బాధాకరమని నెల్లూరులోని బీజేపి నాయకులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఈనెల 3వ తేది సోమవారం రాత్రి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పార్టీలో సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా, పూర్తి స్థాయి సమన్వయ కార్యకర్తగా ఏళ్ళతరబడి ఎంతో క్రమశిక్షణతో పనిచేశారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1991, 96 సంవత్సరాల్లో నెల్లూరు పార్లమెంట్ భాజపా అభ్యర్థిగా పోటీచేశారు. ఆయన అంత్యక్రియలు ఈనెల 4న నెల్లూరు సమీపంలోని అల్లీపురంలో జరిగాయి. బిజెపి కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పి.సురేంద్ర రెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్ తదితరులు ఆయన మృతికి చింతిస్తూ వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# కరోనా బాధితుల కోసం..
# శ్రీసిటీ సాయం

- ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి చొరవతో..10వేల లీటర్ల ఆక్సిజన్
- తిరుపతి కోవిడ్ ఆసుపత్రులకు మరో రెండు ట్యాంకులు



కరోనా బాధితులకు అత్యవసరమైన ఆక్సిజన్‌ను అందించేందుకు శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి సంకల్పించారు. కరోనా బాధితులకు సాయంగా తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి 10వేల లీటర్ల ఆక్సిజన్‌ను అందజేసి ఆయన తన ఔదార్యాన్ని చాటుకున్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న బాధితులను ఆదుకునేందుకు ఆయన తనవంతు సాయం అందజేస్తుండడంతో అందరి ప్రశంసలు అందుకుంటోంది.

ఇటీవల ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, చిత్తూరుజిల్లా కలెక్టర్ హరినారాయణ్, ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డిని కలిసి కరోనా బాధితులకు సత్వర వైద్యసేవలందించేందుకు తగు సహకారం అందించాలని కోరారు. అందుకు స్పందించిన రవీంద్ర సన్నారెడ్డి శ్రీసిటీలోని విఆర్‌వి ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యాన్ని ఆక్సిజన్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలని కోరగా, వెంటనే వారు దానిని సరఫరా చేశారని ఆయన తెలిపారు. దాదాపు 20 లక్షల రూపాయల విలువజేసే ఆక్సిజన్‌ను అందజేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, గతంలో కూడా కరోనా విజృంభించినప్పుడు లాక్‌డౌన్ సమయంలో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలబడేందుకు రెండు కోట్ల రూపాయలు విరాళంగా అందించి ఉన్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. శ్రీసిటీలో అమెరికాకు చెందిన విఆర్‌వి ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ దేశంలో క్రయోజెనిక్ స్టోరేజ్ సిలిండర్లు, ట్యాంకులు తయారుచేసే మూడు కంపెనీల్లో ఒకటని, దేశంలో ఆక్సిజన్ ట్యాంకర్లు, సిలిండర్ల కొరతను తీర్చడానికి ప్రస్తుతం ఆ పరిశ్రమ మూడు షిఫ్టులలో పనిచేస్తోందని, నెలకు 150 క్రయోజెనిక్ సిలిండర్లను ఉత్పత్తి చేసే సామర్థ్యంతో అది పనిచేస్తోందని, ఈ పరిశ్రమ ద్వారా వివిధ ఆసుపత్రులకు లిక్విడ్ ఆక్సిజన్ కంటైనర్లను సరఫరా చేయడం జరుగుతోందని ఆయన వివరించారు.

అదేవిధంగా ఈనెల 4న తిరుపతిలోని కోవిడ్ ఆసుపత్రులకు విఆర్‌వి సంస్థ మరో రెండు మెడికల్ ఆక్సిజన్ ట్యాంకులను పంపిందని ఆయన పేర్కొన్నారు. ఇందులో 13వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రికి, పదివేల లీటర్ల ట్యాంకును తిరుపతి రుయా ఆసుపత్రికి పంపామన్నారు. వీటిలో 13వేల లీటర్ల ట్యాంకును చెన్నైకి చెందిన టాలెంట్‌ప్రో ఇండియా హెచ్‌ఆర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విరాళంగా ఇవ్వగా, 10వేల లీటర్ల ట్యాంకును ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. ఇది సరైన సమయంలో చేసిన సాయంగా టిటిడి అదనపు ఇ.ఓ ధర్మారెడ్డి అభినందించారని ఆయన పేర్కొన్నారు.


సర్వేపల్లి ప్రసాదరావు గారికి శ్రద్ధాంజలి



శ్రీ సర్వేపల్లి ప్రసాదరావు గారు
జననం: 4-9-1941 మరణం: 03-05-2021

మా పితృదేవుడు శ్రీ సర్వేపల్లి ప్రసాదరావు గారు కైలాస ప్రాప్తి పొందినారు. మీ పట్టుదల, కృషి, క్రమశిక్షణ మరియు నిబద్ధత మా ఊపిరిలో నిలిచాయి. మీరు కైలాసంలో ఉన్నప్పటికీ మమ్మల్ని కార్యచరణలో ఉత్సాహంగా నడిపిస్తారని ఆశీస్తూ...

ఇట్లు : సర్వేపల్లి కుటుంబసభ్యులు

గమనిక: శ్రాద్ధకర్మ : తేది. 13-05-2021న మా స్వగృహం హైదరాబాద్‌లో జరుగును.

NAVA NIDHI BUILDTECH PVT.LTD. 9246435449


# పోలీసుల మానవత్వం

## కోవిడ్ మృతునికి అంత్యక్రియలు

కరోనా సోకి మృతిచెందిన వ్యక్తికి దహన సంస్కారాలు చేసి నెల్లూరులోని బాలాజీనగర్ పోలీసులు తమ మానవత్వం చాటుకున్నారు. బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్ వాటర్ ట్యాంకు వద్ద 75 ఏళ్ల వృద్ధుడు ఆదివారం కరోనాతో మృతిచెందగా, మృతుడి కుటుంబసభ్యులు సైతం కరోనా వ్యాధిగ్రస్తులు కావడంతో దహన సంస్కారాలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయం తెలుసుకున్న బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ అంకమ్మ తన సిబ్బందితోపాటు మహిళా సంరక్షణ కార్యదర్శి లక్ష్మీప్రసన్న సహకారంతో దగ్గరుండి మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి దహన సంస్కారాలు చేయించి అందరి ప్రశంసలు అందుకున్నారు. పోలీసులు కఠినంగా ఉంటారనుకునేవారికి.. పోలీసులలోనూ మానవత్వం ఉంటుందని చాటిచెప్పారు.

# సన్నపురెడ్డికి పదవి



భారతీయ జనతాపార్టీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గంలో జిల్లాకు చెందిన బిజెపి నాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి చోటు లభించింది. జిల్లాలో సీనియర్ బిజెపి నాయకుడుగా ఉన్న సన్నపురెడ్డిని బిజెపి కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షునిగా ఎంపికచేస్తూ పార్టీ అధిష్టానం ప్రకటించడంతో నెల్లూరు నగరంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆయన్ను అభినందించారు.



# సీఎం సహాయనిధి నుంచి సాయం

## ఎంపీ ఆదాల ద్వారా రూ.12 లక్షల చెక్కులు పంపిణీ

నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని విజయ డైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. నెల్లూరులో ఇటీవల ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి కార్యాలయంలో 14 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రంగారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ కార్యాలయం ద్వారా వెళ్లిన చెక్కులు కొంతకాలంగా ఆగిపోయాయి. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి చెక్కులు ఆగిన విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదాల ప్రభాకరరెడ్డి చొరవతో ఆ చెక్కులను సీఎం మంజూరు చేశారు. 14 మందికి మంజూరైన 12 లక్షల రూపాయల సీఎం ఆర్థిక సహాయాన్ని ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి ఆదేశాల మేరకు శనివారం అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వర్ణావెంకయ్య, మైనార్టీ నేత అబూబకర్ కూడా పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ళతో జాగ్రత్త!

## - హెచ్చరిస్తున్న జిల్లా ఎస్పీ



మన వ్యక్తిగత వివరాలను వెబ్‌సైట్లలో నమోదు చేసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండకపోతే మోసపోతమని, నకిలీ వెబ్‌సైట్లతో ఎంతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ళు సర్వత్రా పొంచి ఉన్నారని, జిల్లా ప్రజలు చైతన్యవంతులై ఉండి అలాంటి మోసాలకు గురికాకుండా చూసుకోవాలని పోలీసులు పదేపదే చెప్తున్నారు. వ్యాక్సినేషన్ రిజిస్ట్రేషన్‌పై జరుగుతున్న మోసాలపై జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇటీవల అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ వ్యాక్సినేషన్ రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో ఖచ్చితంగా ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచే నమోదు చేసుకోవాలన్నారు. నకిలీ వెబ్‌సైట్లలో మొబైల్ నెంబర్, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేస్తే, అందుకోసమే పొంచివున్న సైబర్ నేరగాళ్ళు వెంటనే ఆయా వివరాలతో బ్యాంకు ఖాతాల్లోని నగదును దోచుకునే అవకాశాలున్నాయని, అందువల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, తమ వ్యక్తిగత వివరాలను తెలియని వెబ్‌సైట్లలో నమోదు చేసుకోకూడదని వివరించారు. ఇప్పటికే సైబర్ నేరగాళ్ళ వల్ల ఎవరైనా మోసపోయివుంటే పోలీస్ స్టేషన్లలోగానీ, లేదా సైబర్‌మిత్ర ఫోన్ 9121211100 నెంబరుకు గానీ ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# కార్మికుల సేవలు అభినందనీయం

## విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి



కోవిడ్ నేపథ్యంలోనూ విజయ డెయిరీ అధికారులు, సిబ్బంది నిరంతరం కష్టపడి పనిచేస్తూ ఉత్పత్తులు పెంచుతూ వినియోగదారులకు సేవలందించడం ఎంతైనా అభినందనీయమని విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ప్రశంసించారు. ఈనెల 3న ఆయన నెల్లూరులోని డెయిరీని తనిఖీ చేశారు. వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో ఉత్పత్తి జరుగుతున్నట్టు సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీ ఉత్పత్తులకు ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. ఎం.డి కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# గూడూరు డివిజన్ వార్తలు

## గూడూరు, కోటలో పర్యటించిన జిల్లా కలెక్టర్



గుడూరులోని గాంధీనగర్‌లో కోవిడ్ రోగుల కోసం ఏర్పాటు చేసిన కోవిడ్ కేర్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్‌బాబు, గూడూరు సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి పరిశీలించారు, అక్కడ రోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు అందుతున్న వైద్య సదుపాయాలు గురించి గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణను అడిగి తెలుసుకున్నారు, ఇప్పటికే ఇక్కడ టిడ్కో సెంటర్‌లో కోవిడ్ రోగుల కోసం 500 పడకలు సిద్ధంగా ఉన్నట్టు రోగులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు సబ్‌కలెక్టర్ తెలియజేశారు. కోవిడ్ రోగులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కోటలో హోం ఐసోలేషన్‌లో ఉన్న కోవిడ్ రోగులకు ప్రభుత్వం నుండి అందుతున్న వైద్యం గురించి వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## సిద్ధారెడ్డికి రెడ్డి సంక్షేమ సంఘం నివాళి



సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులుగా సిద్ధారెడ్డి జనార్ధన్ రెడ్డి సేవలు మరువ లేనివని, ఆయన లేని లోటును ఎవరూ భర్తీ చేయలేరని, వారికి ఎంతో రుణపడి ఉంటామని ఈ నెల 2వ తేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు తమ నివాళులర్పించారు. సిద్ధారెడ్డి కుటుంబసభ్యులకు మనోధైర్యం కలుగజేయాలని భగవంతుని కోరుకుంటున్నామని సంఘం అధ్యక్షులు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి చేవూరు వేణుగోపాల్‌రెడ్డిలు తెలిపారు. కేంద్ర కమిటి ఉపాధ్యక్షులు బుస్సారెడ్డి దశరథరామిరెడ్డి, కార్యదర్శులు సిద్ధారెడ్డి ప్రజేంద్రరెడ్డి, రవీంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, తిరుమూరు సురేష్‌రెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, పులగం సురేష్‌రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నాం

### - ఇంటివద్దకే రేషన్‌పంపిణీ ఆపరేటర్ల ఆందోళన



రాష్ట్ర ప్రభుత్వం తమకు అరకొర వేతనం ఇచ్చి నిరంతరాయంగా పనులు చేయిస్తూ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోందని ఇంటివద్దకే రేషన్ పంపిణీ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గూడూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమ వారం ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అందచేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకే రోజుల తరబడి సమయం పడుతోందని దీనికితోడు కేంద్ర ప్రభుత్వం మరో కోటా అందచేయమని చెప్పడంతో పనిఒత్తిడి పెరిగిపోయినట్లు వాపోయారు. తమ కష్టానికి తగిన ప్రతి ఫలం దక్కడం లేదన్నారు. ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లినా ఇంతకంటే ఎక్కువ వేతనం వస్తుందని చెప్పారు. రెండు నెలలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కోటాను సైతం తామే పంపిణీ చేయాలని చెబుతున్నారని తమతో రెట్టింపు చాకిరీ చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తు న్నారని ఆరోపించారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే పూర్తిగా కార్యకలాపాలు నిలిపేస్తామని స్పష్టం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించా లని కోరారు. వీరి నిరసనతో గూడూరు ప్రాంతంలో నిత్యావసరసరకుల పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. సంఘ నాయ కులు నవీన్, కోటి, మణికంఠ, హరీష్, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతీయ వైద్యశాలలో ఆక్సిజన్ కొరత

గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో ఆక్సిజన్ కొరత వెంటాడుతూనే ఉంది. ఆదివారం కూడా ప్రాంతీయ వైద్యశాలలో ఆక్సిజన్ కొరతతో ఓ మహిళ తీవ్ర అస్వస్థ తకు గురై అనారోగ్యం పాలైనట్లు బంధు వులు తెలిపారు. వైద్యులు అధికారులు రోగులకు ఆక్సిజన్ పంపిణీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరచూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.

## కాలధర్మం

## సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి



సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు, సాంస్కృతిక సమ్మేళనం మాజీ అధ్యక్షుడు సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి(85) మే 1వ తేదీ చెన్నైలో అనారోగ్య కారణంగా కన్నుమూశారు. ఈయనకు భార్య ఇంద్రసేనమ్మ, కుమారుడు సుధీర్‌రెడ్డి, కోడలు ప్రణతి, మనుమరాలు శ్రేష్ఠ ఉన్నారు. జనార్ధన్‌రెడ్డి సాంస్కృతిక సమ్మేళనం సభ్యులుగా ఉండి తరువాత అధ్యక్షులుగా 15సంవత్సరాలకుపైగా ఆ సంస్థకు తన సేవలందించారు. ఆయన గతంలో మైకా రంగంలో రుస్తుం మైకా కంపెనీ పేరుతో పెద్దస్థాయిలో వ్యాపారం చేశారు. గ్రానైట్ రంగంలోనూ ఉన్నత స్థాయికి ఎదిగి విదేశాలకు సైతం గ్రానైట్‌ను ఎగుమతి చేసేవారు. గూడూరు అళఘనాథస్వామి దేవస్థానానికి రెండుసార్లు ఛైర్మెన్‌గా ఉన్నారు. ఆయన ఛైర్మెన్‌గా ఉన్న సమయంలోనే కొన్ని దేవస్థాన భూముల వేలం ద్వారా కోట్ల రూపాయల సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో బ్యాంకులో భద్రపరచి, దానిద్వారా వచ్చే వడ్డీతో భవిష్యత్‌లో అళఘనాథ స్వామి దేవస్థానానికి ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు కలుగకుండా చేశారు. సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి మరణానికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# పాత్రికేయ 'ప్రభాకరుని'..అస్తమయం

## ఉత్తమ కళాకారుడిని కరోనా పొట్టనపెట్టుకుంది



నెల్లూరుకు చెందిన సీనియర్ పాత్రికే యుడు, నటుడు, గాయకుడు మనుబోలు ప్రభాకర్ (67) ఈనెల 5వ తేది బుధవారం కరోనాతో హఠాన్మరణం చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రభాకర్ ఆకస్మిక మృతి నెల్లూరులోని పాత్రికేయులను దిగ్భ్రాంతికి గురి చేసింది. అందరితో ఎంతో కలుపుగో లుగా ఉంటూ, హాయిగా పాటలు పాడుకుంటూ, ఆనందంతో జీవించే ప్రభాకర్ మృతి ఎంతైనా బాధాకరం. గతంలో ఆయన కొంత అనారోగ్యంతో ఉన్నా, ఇటీవలే కోలుకున్నారు. మళ్లీ అస్వస్థతకు గురికావడంతో నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆయన భార్య, కుమారుడు ఇద్దరూ ఆయన్ను కంటికి రెప్పలా చూసుకున్నారు. ఇక రేపోమాపో కోలుకుంటారని అందరూ అనుకుంటున్న సమయంలో విధి వక్రించి కరోనాతో ఆసుపత్రిలోనే తుదిశ్వాస విడిచారు.

ఎంతో సౌమ్యుడు, మృదుభాషి, స్నేహశీలి అయిన ప్రభాకర్ సుమారు రెండు దశాబ్దాలుగా పాత్రికేయునిగా రాణిస్తున్నారు. 'ఆంధ్రప్రభ'లోను, 'లాయర్' పత్రికలోనూ ఆయన సుదీర్ఘకాలం పని చేశారు. పత్రికారంగంలోకి రాకముందు ఆయన నెల్లూరు నగరంలో డాక్యుమెంట్ రైటర్‌గా కూడా అందరికీ సుపరిచితులే. నగరంలోని సాహితీ, కళారంగాల విశే షాలను ఆయన ఎంతో చక్కగా వార్త లుగా రాసేవారు. నాటకరంగంలోనూ ఉంటూ పలు నాటకాలు, నాటికలు వేసి ఉత్తమ నటుడిగా అందరి ప్రశంసలందు కున్నారు. సినీపాటలన్నా, భక్తిపాటలన్నా ఆయనకెంతో ఇష్టం. తాను ఆ పాటల్లో నటిస్తూ, పాటలు పాడుతున్నట్లుగా నోరు కదిలిస్తూ ఆయన తమాషాగా చేస్తున్న మిమిక్రీకి ఆయనే బోలెడంత సంబరపడి పోయే వారు. ఎప్పుడూ నవ్వుతూ నవ్వి స్తుండేవారు. ప్రత్యేకించి ఆయనకు సాయిబాబా అంటే పరమభక్తి. సాయి నాథునిపై ఆయన రాసిన పాటలు ఒక పుస్తకంగా కూడా ముద్రితమయ్యాయి. ఆ పుస్తకాన్ని షిరిడీలో ఇటీవలనే ఆవిష్కరించడం ఆయన చేసుకున్న పుణ్యమే. పలుసార్లు నెల్లూరులోని సాయిదర్బార్ అద్దాల మందిరం నిర్వాహకుల సహకా రంతో భక్తబృందాలతో కలిసి ఆయన షిర్డీకి కూడా వెళ్లారు. ఏదేమైనా.. ఆయన మృతితో నెల్లూరు పత్రికారంగం ఒక ఉత్తమ పాత్రికేయుడిని కోల్పోయినట్లయింది. ప్రత్యేకించి ఆయనకు 'లాయర్'తో ఎంతోకాలంగా ఆత్మీయతానుబంధం ఉంది. పత్రికా రంగంలో అందరికీ స్నేహపాత్రుడు.. నిండుమనసు గల మంచి పాత్రికేయులాయన. ఆయన ఆకస్మిక మృతికి చింతిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది.. 'లాయర్'!...

## కామాక్షితాయి ఆలయ దర్శన వేళల్లో మార్పు



జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి కామాక్షితాయి ఆలయ దర్శన వేళల్లో మార్పులు చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి ఈ నెల 3న ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్ వ్యాప్తి నేపధ్యంలో 5 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్శనానికి వచ్చేవారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, కోవిడ్ నిరోధక నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ దైవ దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

## పెంచలకోనలో ఆంక్షలు

జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో బుధవారం నుంచి కోవిడ్ ఆంక్షలను అమలు చేయనున్నట్లు ఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే స్వామివారి దర్శనం ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత ఆలయాన్ని మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. అద్దెకు గదులు ఇవ్వబోమని స్పష్టంచేశారు. ఆర్జిత సేవలన్నింటినీ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామన్నారు. అర్చనలు, కల్యాణాలు, అభిషేకాలు, హోమాలను ఏకాంతంగానే చేస్తామని వెల్లడించారు.

## లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

గూడూరు పురపాలక సంఘంలోని అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ రఘుకుమార్ తెలిపారు. తూర్పు గూడూరు, పోటుపాలెం, చిల్లకూరు తదితర ప్రాంతాలలో వేర్వేరు సర్వే నెంబర్లలోని లే అవుట్లకు పట్టణ ప్రణాళిక విభాగం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఆయా ప్రాంతాలలో లేఅవుట్లపై ఏవైనా అభ్యంతరాలుంటే 15 రోజుల్లోపు కార్యాలయంలో రాతపూర్వకంగా తెలియ చేయాలని సోమవారం ఇక్కడ ఓ ప్రకటనలో తెలిపారు.

# ఎర్రచందనం స్మగ్లర్లు దొరికారు

## రూ.30 లక్షల సొత్తు స్వాధీనం





పెళ్ళకూరు మండలంలోని చెంబడిపాళెం వద్ద 30 ఎర్ర చందనం దుంగలతో పాటు ఓ కారు, ఇన్నోవా, జీపులను అధి కారులు ఈనెల 2న పట్టుకు న్నారు. వాటి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని గూడూరు ఇన్‌ఛార్జి డీఎస్పీ నాగరాజు తెలిపారు. పెళ్లకూరు పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు. 'చెంబడి పాళెంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అటువైపు వస్తున్న ఇన్నోవా, కారు, జీపులను ఆపి పరిశీలించగా వాటిలో 30 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయని తెలిపారు. వాహనాలను వదిలి ఏడుగురు స్మగ్లర్లు పరారయ్యారని, వారిని నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు నుంచి నరసింహకొండకు వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతంలో పట్టుకున్నామన్నారు. వారి వద్దనున్న ఏడు సెల్‌ఫోన్లు, రూ.6,860 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మూడు జిల్లాలకు చెందిన స్మగ్లర్లు బృందాలుగా ఏర్పడి ఎర్రచందనాన్ని ఇతర ప్రాంతాలకు తరలించే ఎత్తుగడను చిత్తు చేశామని, ఆ ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఆదేశాలతో ఎర్రచందనం స్మగ్లర్లపై కట్టుదిట్టమైన నిఘా పెట్టామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టుబడిన నిందితుల్లో గల్లా ఉదయ్‌భాస్కర్ (కడప జిల్లా), యనమల జాన్సన్ (నెల్లూరు), కారుమంచి సురేంద్ర (నెల్లూరు), భాస్కర్ (కడప జిల్లా), నూతి శ్రీను (కడప జిల్లా), దాసరి రమణయ్య (చిత్తూరు జిల్లా), మేకల మణి (చిత్తూరు జిల్లా) ఉన్నారని డిఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభచూపిన సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సై మనోజ్‌కుమార్, ఏఎస్సై కిలివేటి సుబ్రమణ్యం, కానిస్టేబుళ్లు చిరంజీవి, శ్రీనివాసులు, కుమార్‌రాజా, సునీల్‌కుమార్‌లను డీఎస్పీ అభినందించారు.

# ఎంటియు 1010 ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

## ప్రభుత్వానికి రైతు నాయకుని వినతి

నెల్లూరుజిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు ఎంటియు 1010 వరి రకాన్ని కూడా సాగుచేస్తున్నారని, ఆ ధాన్యాన్ని కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనేలా ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘాల సమాఖ్య నాయకుడు చిరసాని కోటిరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఆ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయపోతుండడంతో రైతులు ఎన్నో కష్టనష్టాలకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎంటియు 1010 రకం వరిసాగు జిల్లా వాతావరణానికి అనుకూలంగా ఉంటుందని కనుక ఆ వరిసాగును ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు.

### నాటుసారా

# స్థావరాలపై దాడులు

పొదలకూరు, మనుబోలు మండ లాల్లో ఇటీవల అధికారులు దాడులు చేసి 2 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సెబ్ జిల్లా అదనపు ఎస్పీ కె.లక్ష్మి ఆదేశాలతో సోమవారం గూడూరు, రాపూరు సెబ్ అధికారులు పొదలకూరు, మనుబోలు మండలాల్లో సారా బట్టీలపై దాడులు చేశారు. నాటుసారా తయారు చేస్తున్నవారిని గుర్తించి వారిపై కేసులు పెట్టారు. నిందితులంతా బిరదవోలు గ్రామానికి చెందిన వారుగా అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో రాపూరు, గూడూరు సెబ్ అధికారులు సూర్యనారాయణ, సుబ్బారావు, ఎస్సైలు రవికుమార్, కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

### కరోనాతో

# హెడ్‌కానిస్టేబుల్ కన్నుమూత

జిల్లా పోలీస్ శాఖలో కరోనా కాటుకు మరో పోలీసు బలయ్యాడు. 'దిశ' పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.రవి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తరుణంలో కరోనా సోకింది. నెల్లూరులోని జిజిహెచ్‌లో చికిత్సపొందుతూ ఆయన ఈనెల 1న మరణించారు. ఆయన మృతికి జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ తన విచారం వెలిబుచ్చారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని అమరవీరుల స్థూపం వద్ద రవి చిత్ర పటానికి ఏఎస్పీ వెంకటరత్నం, ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, డిఎస్పీలు వీరకుమార్, నాగరాజు, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరమ్మ, ఏవి రమణ, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్, ఆర్. శ్రీనివాసులురెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, వై.శ్రీహరి తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# ప్రసన్నుని కొత్త రథం పనులు ప్రారంభం

బోగోలు మండలంలోని బిట్రగుంటలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి కొత్త రథం తయారుచేయించే పనులకు ఈనెల 3న అంకురార్పణ జరిగింది. స్వామివారికి నూతన రథాన్ని నిర్మించాలని కోరుతూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి విన్నవించడంతో నూతన రథ నిర్మాణానికి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. 1.15 కోట్ల రూపాయల వ్యయంతో శ్రీవారి బ్రహ్మరథం, రథశాల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. తొలుత రథానికి ఉపయోగించే కలప, సామగ్రికి వేదగిరి సత్యనారాయణాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వచ్చే బ్రహ్మోత్సవాలలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి నూతన రథంపై కొలువుదీరేలా కృషి జరుగుతోందన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి రథం శిల్పి సింహాద్రి గణపతి ఆచార్యులు, స్థపతి సురేంద్ర, గణపతి ఆచార్యులతోపాటు పలువురు అధికారులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

# విజృంభిస్తున్న గొలుసు దొంగలు

## విద్యార్థిని మెడలోని బంగారుదండను లాక్కెళ్ళారు

జిల్లాలో గొలుసు దొంగలు మళ్ళీ విజృంభిస్తున్నారు. రోడ్డుపై నడిచి వెళుతున్న ఒక విద్యార్థిని మెడలోని బంగారు గొలుసుని లాక్కెళ్ళారు. నెల్లూరు రూరల్ మండలంలోని చెముడుగుంట నక్కలకాలనీ సమీపంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో సూళ్లూరు పేటకు చెందిన విద్యార్థిని ఇంటర్ చదువుతోంది. ప్రభుత్వం ఇంటర్ పరీక్షలు వాయిదా వేయడంతో సెలవులు ప్రకటించారు. దీంతో ఈనెల 3న ఆ విద్యార్థిని కళాశాలనుంచి ఇంటికి వెళ్లేందుకు తన లగేజీ తీసుకుని బస్సు ఎక్కేందుకు రోడ్డుమీద వెళ్తుండగా ఎదురుగా మోటార్‌బైక్‌పై వేగంగా వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని రెండు సవర్ల బంగారుదండను లాక్కొని పరారయ్యారు. ఆ విద్యార్థిని ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. సమీపంలో సీసీ పుటేజీలు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సిపిఎం నాయకుని మృతికి సంతాపం

నెల్లూరు రూరల్ 17వ డివిజన్ కార్యదర్శి, సిపిఎం నాయకుడు రియాజ్‌బాషా మృతికి ఈనెల 1న సిపిఎం జిల్లా నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్, మోహన్‌రావు, అల్లాడి గోపాల్, చంద్రారెడ్డి, విజయకుమార్, కత్తి శ్రీనివాసులు తదితరులు రియాజ్‌బాషా భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# హెడ్‌కానిస్టేబుల్ మృతి

నెల్లూరు అగ్నిమాపక శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.రామ్మోహన్ ఈ నెల 4న మృతిచెందారు. గత కొన్ని రోజుల నుంచి కోవిడ్ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

# భక్తుల బాధలు తీర్చే.. 'గొలగమూడి' భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి

***'ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలయ్యా', 'ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా' అంటూ తన మహనీయమైన బోధనలతో ప్రజలందరి మనసుల్లో దైవంగా కొలువై ఉన్నాడు.. అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు. ఆపద్బాంధవునిగా, భక్తుల కోర్కెలు నెరవేర్చే దైవంగా శ్రీ వెంకయ్యస్వామి ఎంతో ప్రసిద్ధి. స్వామివారి మహిమలు, లీలలు అత్యద్భుతం. లక్షలాది మంది భక్తులకు అవి అనుభవైకవేద్యం. ప్రతిఏటా ఆగస్టులో జరిగే స్వామివారి ఆరాధనా మహోత్సవాలకు భక్తజనం కొల్లలుగా వస్తుంటారు.***

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని వెంకటాచలం మండలంలో కొలువై ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రం..గొలగమూడి. ఈ చిన్న గ్రామంలో ఉన్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయం ఎంతోకాలంగా భక్తుల బాధలు తీర్చే మందిరంగా వెలసి వర్ధిల్లుతోంది. నెల్లూరుకు కేవలం 10కిలోమీటర్ల దూరంలోనే ఈ క్షేత్రం ఉంది. నరుడే నారాయణునిగా అవత రించినట్లుగా.. మానవునిగా జన్మించి తన మహనీయమైన బోధనలు, సూక్తులతో సకల మానవాళికి ధర్మోపదేశం చేసి, ఎంతోమంది ప్రజల వ్యాధులు, బాధలు తీర్చి అందరి మనసుల్లో దైవంగా నిలిచిన అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి అద్భుత చరిత్ర ఎంతో ఆసక్తికరమైనది.

### అవధూత చరిత్ర :

దాదాపు నూటపాతికేళ్ళ కిందట నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలోని నాగులవెల్లటూరు గ్రామంలో సోంపల్లి పెంచల నాయుడు, పిచ్చమ్మ పుణ్యదంపతుల గారాల తనయుడుగా వెంకయ్యస్వామి జన్మించారు. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు వెంకటపతి. సామాన్యమైన రైతు కుటుంబంలో జన్మించిన వెంకయ్యస్వామి చిన్నతనం నుంచి యుక్తవయసు వచ్చే దాకా సేద్యపు పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఓరోజు







## మన దేవాలయాలు 46

పెద్ద విషసర్పం ఆయన కాలుపై కాటువేసినా విషం ఎక్కకుండా ఆయనకు ఏమీ కాకపోవడంతో అప్పట్లోనే ప్రజలు ఆయన మహిమాన్వితుడని గుర్తించారు. ఆ తర్వాత ఒకరోజు తీవ్రంగా జ్వరం రావడం, మతి తప్పినట్లుగా ప్రవర్తిస్తూ..ఆ తర్వాత ఇల్లు వదిలి వెళ్లిపోయి అడవుల్లో తిరుగుతూ అక్కడ ఒక రుషీశ్వరుని ఆశీస్సులతో నిరంతరం దైవధ్యానం చేస్తూ అనేక సంవత్సరాలు తపస్సు చేయడం జరిగాయి. ఆ తర్వాత ఆయన మళ్ళీ తిరిగి వచ్చింది అవధూత వెంకయ్యస్వామిగానే. వెంకయ్యస్వామి ఏది చెప్తే అది జరుగుతుండడం, తన అద్భుతమైన మహిమలతో వేలాదిమంది ప్రజల వ్యాధులను, బాధలను నివారిస్తుండడంతో ప్రజలందరూ స్వామివారిని అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామిగా ఆరాధించేవారు. ప్రజలంతా వచ్చి వానలు రావాలని కోరుకున్నా, వరదలు తగ్గాలని విన్నవించుకున్నా భక్తుల సమక్షంలోనే రోజుల తరబడి అగ్నిగుండం వేసి 'ఓం నారాయణ ఆదినారాయణ' అంటూ వెంకయ్యస్వామివారు ధ్యానంలో మునిగి పోయేవారు. అంతే..వానలు వచ్చాకనే ఆయన కళ్ళు తెరిచేవారు. వరదలు తగ్గాకనే ఆయన తిరిగి జావ తాగేవారు. అప్పటిదాకా మంచినీళ్ళు కూడా ముట్టేవారు కాదు.

### స్వామివారి దివ్య బోధనలు, సూక్తులు :

భగవాన్ వెంకయ్యస్వామి బోధనలంటే భక్తులకెంతో ఇష్టం. స్వామివారి సూక్తులు నేటికీ భక్తులకు కరతలామలకమే. మానవులంతా మానవత్వంతో బతకాలని చెప్పేవారు. మూగజీవాల పట్ల కరుణతో ఉండాలనేవారు. 'ఆశ పోతే.. అంతా పోతుందయ్యా' అనేవారు. 'పదిపైసలు దొంగిలిస్తే పావలా పోతుందయ్యా' అని హెచ్చరించేవారు. 'అగ్నిగుండం కోటిలింగాల పూజ కదయ్యా' అని చెప్పేవారు. భక్తులందరికీ 'ఓం నారాయణ–ఆదినారాయణ' మంత్రాన్ని ఉపదేశించేవారు. స్వామివారు గొలగమూడికి వచ్చి నిలిచాక ఇక్కడే ఒక చిన్న పూరిగుడిశెలో అత్యంత నిరాడంబరంగా ఉంటూ భక్తుల బాధలు తీర్చేవారు. ఇప్పటికీ ఆ కుటీరంలో భక్తులకు ఇస్తున్న తెల్లటి నూలుదారమే 'వెంకయ్యస్వామి రక్షా దారం'గా భక్తులందరికీ రక్షగా ఉంటోంది. కాలక్రమంలో స్వామివారు గొలగమూడిలో జీవ సమాధి పొందాక, అక్కడనే ఆయన సమాధి మందిరం నిర్మితమైంది. నేటికీ స్వామివారి సమాధిమందిరమే సమాధాన మందిరంగా భక్తుల బాధలను బాపుతోంది. ఆ తర్వాత ఆలయ అభివృద్ధి కోసం ఇటీవలి కాలంలో హైకోర్టు ఆదేశాలతో ఏర్పడిన ఆశ్రమ కమిటీ వారి ఆధ్వర్యంలో ఆలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. స్వామివారికి నిత్య పూజలు, సేవలు అన్నీ దేదీప్యమానంగా జరుగుతున్నాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు, వసతికి గదులు ఏర్పాటయ్యాయి. ప్రతి ఏటా ఆగస్టు 18 నుంచి 24వ తేది వరకు గొలగమూడిలో వైభవంగా జరిగే స్వామివారి ఆరాధనోత్సవాలకు భక్తజనం పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు.

# తప్పు నరేంద్రమోడీది కాదు...






‘అత్తమీద కోపం దుత్త మీద చూపెట్టినట్టు’ అని మనకు తెలుగులో ఒక సామెత ఉంది. 2004 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మీద ఏవగింపుతో ఉన్న మనం... 2014 ఎన్నికలు వచ్చేసరికి బీజేపీ వైపు చూశాం. ప్రజల ‘మూడ్’ కనిపెట్టిన నరేంద్ర మోహనదాస్ మోడీ అనే గుజరాత్ ముఖ్యమంత్రి– దేశం మీద సమ్మోహనాస్త్రం విసిరారు. ‘గుజరాత్ ఓ భూతల స్వర్గం!’ చూడండి!! కథనాలలో మనం తడిసి ముద్ద అయిపోయాం. దేశంలోని ప్రింట్, ఎలెక్ట్రానిక్ మీడియా మొత్తం మోడీ భజనలో తరించిపోయింది. మన్మోహన్‌సింగ్, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అసలు మొత్తం కాంగ్రెస్‌పార్టీ కలిపి కూడా మోడీ కాలి గోటికి సరిపోరని సంబరపడిపోయాం.

1984 లోకసభ ఎన్నికల్లో– దేశం మొత్తం మీద రెండు... అంటే రెండే స్థానాలకు కుంచించుకు పోయిన బీజేపీకి ప్రాణభిక్ష పెట్టి, దేశంలో ఆ పార్టీకి తిరిగి జవసత్వాలు కల్పించిన లాల్‌కృష్ణ అద్వానీని కాదని.... గుజరాత్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోడీ 2014లో బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థి కావాలని మనం కోరుకున్నాం. ఆయన ప్రధాని అయితే గుజరాత్ లాగానే ఈ దేశం మొత్తం భూతల స్వర్గంగా మారిపోతుందని కలలు కన్నాం. ఈ దేశానికి ఇంత కాలానికి ఒక మగాడు దొరికాడని మురిసి పోయాం. ఆయన బహిరంగసభకు టికెట్ పెడితే.. కొనుక్కుని మరీ సభలకు ఎగబడ్డాం. 10 సంవత్సరాలపాటు గౌరవప్రదమైన నాయకత్వం అందించిన మన్మోహన్‌సింగ్‌కి... నరేంద్ర మోడీకి అసలు పోలికే ముందని అంటూ... కాంగ్రెసుని ఈసడించి పారేశాం. సోనియాగాంధీని, రాహుల్‌గాంధీని నోటికొచ్చినట్టు తూలనాడాం. ఎవరైనా తూలనాడుతుంటే... ఆనందంతో చప్పట్లు కొట్టాం.

భారత రాజకీయాలలో కాకలుతీరిన కర్మయోగి వాజపేయికి కూడా సంపూర్ణ మెజారిటీ ఇవ్వని మనం.... నరేంద్రమోడీకి 2014లో సంపూర్ణ మెజారిటీ ఇచ్చాం. 2014 మే నెల 26వ తేదీ సాయంత్రం 6.13గంటలకు భారత 15వ ప్రధానిగా ప్రమాణం చేస్తుంటే భారతీయుల కలలు నెరవేరాయంటూ పరవశులైపోయాం. భారత ప్రధానిగా నాలుగువేల దేశ, విదేశీ ప్రముఖుల సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేయడంతో మన పాత్ర ముగిసింది. ఆయన మొదటిసారి పార్లమెంట్ భవనంలోకి అడుగుపెట్టేముందు భారత ప్రజాస్వామిక దేవాలయం మెట్లకు శిరస్సు ఆనించి ప్రణమిల్లితే– ఆయన ప్రజాస్వామిక అంకిత భావ వ్యక్తీకరణ తీరుకు ముగ్ధులమైపోయాం. గతంలో పార్లమెంట్ మెట్లకు శిరస్సు తాకించి, ప్రణమిల్లిన ప్రధానమంత్రి ఎవరైనా ఉన్నారా అంటూ దేశ భక్తితో ఉప్పొంగిపోయాం. మోడీని ఎవరైనా పల్లెత్తు మాట అంటే వారిపై వంద మాటలతో విరుచుకుపడిపోయాం.

### టిర్.. టిర్.. టిర్.. టిర్.. టిర్....

ఇప్పటికి ఏడేళ్లు గడిచిపోయాయ్. మోడీ పేరు ప్రస్తావనకు వస్తే చాలు... వణికి పోతున్నాం. టీవీలో బొమ్మ కనపడితే చాలు... చూడలేక కళ్ళు మూసేసుకుంటున్నాం. ఆ పేరు... నోటితో ఉచ్చరించడానికి కూడా ఇష్టపడలేకపోతున్నాం. తాను...తన ప్రతిష్ఠ... తన ఇమేజ్, తన పార్టీ తప్ప మరో యావలేని నరేంద్ర మోడీని చూస్తూ చూస్తూ నిలువునా నీరైపోతున్నాం.

ప్రధానమంత్రి హోదాలో సుమారు 60 దేశాలలో ఆయన పర్యటించారు. ఒక్క పర్యటనకు కూడా ఆయన భారత విదేశాంగ మంత్రిని వెంటబెట్టుకు వెళ్ళలేదు. విదేశాల్లో ఆ దేశాల పూర్తి దృష్టి, కాన్సంట్రేషన్, ప్రచారం మొత్తం తన మీదే ఉండాలి.. తన ఇమేజ్ పెరగాలి. ఇదీ తపన. స్వదేశంలో ఉంటే ప్రతిపక్ష పార్టీల హననం. వారిని, వారి ఆధ్వర్యంలోని ప్రభుత్వాలను చెరబట్టడం.., వారిపైకి సీబీఐ, ఈడీ, విజిలెన్స్ దాడులను ప్రేరేపించడం, వారి ఎం.ఎల్.ఏలను అపహరించడం, వారి ప్రభుత్వాలను దొంగిలించడం.. దేశ సంపదను గుజరాతీకరించడం. ఈ ఏడేళ్లలో ఒక్కసారికూడా పత్రికా విలేకరుల సమావేశాన్ని ఒక్కసారంటే ఒక్కసారి కూడా అడ్రస్ చేయని ఏకైక భారత ప్రధాని ఆయన. 60సార్లకుపైగా విదేశాలకు వెళ్లినా తన విమానంలో విలేకరులను సైతం తీసుకెళ్ళని ఏకైక ప్రధాని ఆయన.

తన ఇమేజ్, తన కాషాయ రంగును దేశమంతా పులమడం, దేశాన్ని గుజరాతీకరించడం మినహా మరో ఆలోచన లేని నరేంద్రమోడీని చూసి, భరత మాత భయకంపితురాలై పోతున్నది. మంత్రులు, వ్యవస్థలు, ప్రజలు నిమిత్తమాత్రులైపోయారు. ‘మోడీ ఒక్కటే సత్యం...దేశం సమస్తం మిథ్య’ అన్నట్టుగా దేశంలోని మీడియా మొత్తం ప్రణమిల్లుతోంది. దేశంలో తాండవిస్తున్న రాజకీయ, పరిపాలక, ఆర్థిక అరాచకాలకు కాంగ్రెస్సే కారణమంటూ మీడియా ఇప్పటికీ కథనాలు వండి వార్చుతున్నది. పాలనా పరంగా ఇంతటి నిష్క్రియాపరత్వం, ఇంతటి వ్యక్తి పూజ, ఇంతటి ‘ఆత్మస్తుతి–పరనింద’ ఇంతటి వంచన, భారత సమాజం గతంలో కననిది...విననిది. పదవి ఏడైనప్పటికీ, ఇంతటి వేషధారణను అమాయక భారతావని గతంలో చూడనిది. రోజుకో వేషం... వారానికో దేశం. దేశ పరిపాలన అంటే ఏమిటో ఆయనకు తెలియదనే విషయం మనకు తెలియదు. భారతీయ సమాజ హృదయం అంటే ఏమిటో ఆయనకు తెలియదనే విషయం మనకు తెలియదు. ప్రజాస్వామిక విలువలు అంటే ఏమిటో ఆయనకు తెలియదనే విషయం మనకు తెలియదు. రాజకీయ మర్యాదలు...ప్రత్యర్థులను గౌరవించడం అంటే ఏమిటో ఆయనకు తెలియదనే విషయం మనకు తెలియదు. మన మీడియా మనకు చెప్పలేదు. రామచంద్ర గుహ లాంటి చరిత్రకారులు మొదటినుంచీ నెత్తీ... నోరు కొట్టుకుంటున్నా మీడియా భజన హోరులో ఎవరికీ వినిపించలేదు.

కానీ, బెంగాల్‌తో సహా నాలుగు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా మోడీ విశ్వరూపాన్ని చూశాం. దేశంతో, దేశ సమస్యలతో, దేశాన్ని మృత్యులోకంలో విహరింపచేస్తున్న కరోనా రెండో దశతో తనకు సంబంధమే లేనట్టుగా ఆయన ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతుండడంతో... కరోనా కూడా సంతోషించింది. దేశం మీద విరగదీసుకు పడిపోయింది. రోజూ మూడూ, మూడున్నర లక్షల మంది కరోనా బారిని పడుతుంటే... ఆయన మాత్రం బెంగాల్‌లో మమతా బెనర్జీని మట్టి కరిపించడం ఎలా అన్న ఆలోచనల్లోనే మునిగితేలారు. దేశంలో కరోనా వల్ల వేలాదిమంది అమాయక జనం క్షణాలలో మృత్యువు పాలవుతుంటే... యమధర్మరాజు మరో నాలుగు దున్నపోతుల్ని వేసుకుని దేశమంతా స్వైర విహారం చేస్తుంటే మోడీ మాత్రం బెంగాల్‌లోని మతువా వర్గం వారి ఓట్లను కొల్లగొట్టేందుకు బంగ్లాదేశ్ వెళ్ళి, వారికి చెందిన ప్రార్థనా మందిరంలో పూజలుచేసి వచ్చారు. వారంతా బంగ్లాదేశ్ నుంచి కొన్ని తరాల క్రితం వచ్చి బెంగాల్‌లో స్థిరపడ్డారట. అందుకని, అటు నుంచి నరుక్కొద్దామని...దేశాన్ని కరోనాకు వదిలేసి బంగ్లాదేశ్‌కు వెళ్లారు. దేశంలో కరోనా ఇటు విలయ తాండవం చేస్తుంటే ఆయన బెంగాల్ ఎన్నికల ప్రక్రియ మీద శివతాండవం చేసుకుంటూ పోయారు.

### విదేశీ మీడియా చెప్పేదాకా తెలియలేదు

కరోనా సూపర్ స్ప్రెడర్‌గా మారిపోయిన విషయాన్ని విదేశీ మీడియా చెప్పేవరకు మనకు తెలియలేదు. మన మీడియాకు భయం. వణుకు. దడ. బిడియం. సిగ్గు. కాంగ్రెస్ మీద ద్వేషం. డబ్బు మీద ప్రేమ. కానీ, వాషింగ్టన్ పోస్ట్, టైమ్, గార్డియన్, వంటి విదేశీ పత్రికలకు ఈ సుగుణాలు ఏమీ లేవు. ఇండియాను చూసి ఒక కన్నీటి బొట్టు విడిచాయి. ఈ పరిస్థితికి మోడీ నిష్క్రియాపరత్వం కారణమని తెగేసి చెప్పాయి. ఆయనకు అహంభావం తప్ప పాలించడం తెలియదన్నాయి. ఇండియాలో శవాలను తగలేయడానికి స్మశానాల్లో జాగా కూడా దొరకడం లేదన్నాయి. ఆక్సిజన్ లేక జనం పిచ్చుకల్లా రాలిపోతున్నారు అన్నాయి. కుటుంబాలకు కుటుంబాలే కరోనా మృత్యు కౌగిలిలోకి జారిపోతున్నాయి అన్నాయి. వాగాడంబరమూ... రాజకీయ ప్రత్యర్థుల హననం తప్ప మోడీకి మరో విషయం పట్టదని బల్లగుద్ది చెప్పాయి. ఈ కవరేజ్‌ల వల్లే ఇండియా పరిస్థితి బయటి ప్రపంచానికి తెలిసింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా భారత్‌పై సానుభూతి వెల్లువెత్తింది. వరద బాధితుల్ని చూసి... బట్టలిస్తామని కొందరు మందులిస్తామని కొందరు, డబ్బులిస్తామని కొందరు... కప్పుకోడానికి దుప్పట్లు ఇస్తామని కొందరు ముందుకు వచ్చే రీతిలో ప్రపంచ వ్యాప్తంగా చిల్లర మల్లర దేశాలు కూడా సాయం చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నాయి. చివరికి పాకిస్తాన్ కూడా ఇండియా పరిస్థితిని చూసి రెండు కన్నీటి చుక్కలు రాలుస్తున్నట్టు నటించింది. ఒకళ్ళు ఆక్సిజన్ సిలిండర్లు పంపుతుంటే... ఒకరు మందులు పంపుతున్నారు. ఒకరు మాస్కులు పంపుతుంటే... ఒకరు వెంటిలేటర్‌లు పంపుతున్నారు.

### కరోనాను కట్టడి చేసే ప్రణాళిక ఏదీ?...

ఇలా, ఇండియమ్మను చూసి, ఎవరికి తోచిన సాయం వారు చేస్తుంటే... మోడీ మాత్రం 20వేల కోట్లతో కొత్త పార్లమెంట్ భవన సముదాయం ఎంత త్వరగా నిర్మించాలా అని ఆలోచిస్తున్నారు. ఈ కరోనా వల్ల, దాని నిర్మాణ పనులు ఎక్కడ మందగిస్తాయో అని ఆయన ఆందోళనపడుతున్నారు. తన ప్రస్తుత పదవీ కాలంలోనే ఆ కాంప్లెక్స్‌లో కట్టబోయే ‘ప్రధాని నివాసం’లోకి షిఫ్ట్ అయిపోవాలని ఆయన తహతహలాడిపోతున్నారు. ప్రపంచమంతా ఇండియాలోని ప్రస్తుత పరిస్థితి చూసి ఆందోళనపడుతుంటే.... ఆయన మాత్రం భవిష్యత్ భారతం గురించి ఆలోచిస్తున్నారు. అటువంటి ప్రధానిని రాజీనామా చేయమని కవులు, కళాకారులు, మేధావులు, శాస్త్రవేత్తలు, రాజకీయ ప్రత్యర్థులు రిటైర్డ్ ఉన్నతాధికారులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ఈ కరోనాను నియంత్రించడానికి ఆయన వద్ద ప్రణాళిక ఏమీ లేదంటున్నారు. పాలన అనేది ఆయనకు తెలియదు అంటున్నారు. ‘పల్లే కన్నీరూ పెడుతోంది’ అంటూ గోరటి వెంకన్న పాట స్టైల్‌లో ‘దేశం కన్నీరూ పెడుతోంది...’ అంటూ పాటలు పాడుతున్నారు.

కానీ, ఆయనను ఆ పదవిలో కూర్చోబెట్టింది మనమే. ఆయనకు ఓ రెండు కొమ్ములు మొలిపించింది మనమే. పల్లకీలో కూర్చోబెట్టింది మనమే. ఆయన ప్రచార పటాటోపాన్ని, అహంభావంతో అతిశయ నడవడికను, నిష్క్రియాపరత్వాన్ని, రాజకీయ విలువల వలువలను నడి బజారులో చెరబట్టడాన్ని, అలవోకగా అబద్ధాలు ఆడే కళలో గల నైపుణ్యాన్ని చూసి ఇప్పుడు గుండెలు బాదుకుంటూ దిగిపో... దిగిపో అంటూ అరిచి గీ పెడితే ఎలా??

ఈ బుద్ధి ఆయనను నెత్తి మీద పెట్టుకుని ఊరేగక ముందే ఉండాలి. ఇప్పుడేడ్చి ఏమిటి సుఖం. మోడీ శైలే అంత. అది ముందుగా తెలుసుకోలేని వారిది తప్పు. మోడీ ది కాదు.

– భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

## భాష్పాంజలి



మీ కలం.. ఆగిపోయిందంటే నమ్మలేకున్నాం
మీ గళం.. ఇక వినపడదంటే తట్టుకోలేకున్నాం
మీ నటన.. ఇక కనపడదంటే జీర్ణించుకోలేకున్నాం

పాత్రికేయునిగా, గాయకునిగా, నటునిగా
మీ సేవలు సదా చిరస్మరణీయం

మీ స్మృతికి భాష్పాంజలి ఘటిస్తూ..

లాయర్
యాజమాన్యం & సిబ్బంది



## నిరాడంబర శాస్త్రవేత్త..

# డా. జగదీష్ అస్తమయం

ఎంతోమంది విఖ్యాత శాస్త్రవేత్తలు ఉండవచ్చు కానీ, డా.జగదీష్‌లా నిరాడంబరంగా, నిగర్వంగా ఉండేవారు నేటి అధునాతన కాలంలో బహుశా అరుదనే అనుకోవచ్చు. ప్రపంచ ప్రఖ్యాతిని పొందిన శాస్త్రవేత్తగా ఆయన రాణిస్తున్నా ఎప్పుడూ ఆయన ముఖంలో గర్వం కనపడేది కాదు. అలాంటి నిగర్వి, నిరాడంబరుడు.. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగిఉండే సౌమ్యుడు, విఖ్యాత శాస్త్రవేత్త, డాక్టర్ అనుమకొండ జగదీష్(73) ఈనెల 2వ తేదిన స్వల్ప అస్వస్థతతో ఆకస్మిక మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్తగా ఆయనకు గొప్ప పేరుంది. విఆర్ కళాశాల విశ్రాంత ఫిజిక్స్ ఆచార్యుడుగా నెల్లూరుజిల్లాలో ఆయన అందరికీ పరిచయమే. ఆయన మృతికి ఆయన సహచరులు, విఆర్‌కళాశాల అధ్యాపకులు అందరూ ఆవేదన వ్యక్తం చేస్తూ తమ సంతాపం తెలిపారు.

డా. జగదీష్ 1947 ఆగస్టు 13న జన్మించారు. తల్లిదండ్రులు సుబ్బమ్మ-రామదాసుల ప్రోత్సాహంతో ఆయన ఉన్నత చదవులు చదువుకున్నారు. చిన్నతనం నుంచి ఆయనకు శాస్త్ర సాంకేతిక విషయాలపై ఆసక్తి ఉండేది. బి.ఎస్.సి వి.ఆర్ కళాశాలలోనే చదివి, 1968లో ఆ కళాశాలలోనే ఆయన ఫిజిక్స్ విభాగంలో డెమాన్‌స్ట్రేటర్‌గా చేరారు. 1996లో అధ్యాపకునిగా స్వచ్ఛంధ ఉద్యోగ విరమణ చేశారు. 1979లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్‌సి (ఫిజిక్స్) డిగ్రీ పొందారు. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని ఐఐటి రూర్కీ విశ్వవిద్యాలయం నుంచి ఆయన 1986లో 'విండ్ ఎనర్జీ' అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టాపొందారు. అప్పటినుంచి డా.జగదీష్ ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై పరిశోధనలు చేస్తూ ప్రపంచఖ్యాతి పొందారు. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, జర్మనీ, ఇంగ్లండ్ తదితర 20 దేశాల్లో ఆయన పర్యటించి శాస్త్ర సాంకేతిక విషయాలపై ఉపన్యాసాలు చేశారు. అంతర్జాతీయ సైన్స్ పత్రికల్లో110కి పైగానే పరిశోధనా పత్రాలు ప్రచురించిన ఘనత ఆయనది. విఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ యలవర్తి నాయుడమ్మ మార్గదర్శకంలో శాస్త్రవేత్తగా రాణించారు. నాయుడమ్మ మరణించాక ఆయన పేరుతో 'నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్' అనే సంస్థను స్థాపించి, దానికి డైరెక్టర్‌గా ఉంటూ ప్రపంచ ప్రఖ్యాతిపొందిన ప్రముఖులకు, శాస్త్రవేత్తలకు 'ప్రొఫెసర్ నాయుడమ్మ స్మారక అవార్డు'లను అందజేసి నెల్లూరుకు విశిష్ట గుర్తింపును తీసుకువచ్చారు. ఎంతోమంది ప్రముఖులతో, శాస్త్రవేత్తలతో డా.జగదీష్‌కు సన్నిహిత సంబంధాలుండేవి. విఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరుతో కూడా ఆయన అనేక అవార్డులను ప్రముఖులకు ప్రదానం చేశారు.

### ఎన్నెన్నో ప్రపంచస్థాయి అవార్డులు :

డా.జగదీష్ ప్రపంచస్థాయిలో ఎన్నో అవార్డులు సాధించారు. అమెరికా నుంచి 1991లో మార్గరెట్ నోబుల్ ఫౌండేషన్ అవార్డు, ఇంగ్లండ్ నుంచి 196-97లో ఇంటర్నేషనల్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, మళ్ళీ అమెరికా నుంచి 1999లో ఇంటర్నేషనల్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ఇలా ఎన్నో విశిష్టమైన అవార్డులను సాధించి నెల్లూరుకు ఎనలేని కీర్తిప్రతిష్టలు తెచ్చారు. ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దికి చెందిన 2వేల మంది ప్రముఖ శాస్త్రవేత్తల్లో ఒకరుగా ఇంగ్లండ్ నుంచి 1998లో ప్రతిష్టాత్మకమైన అవార్డును కూడా పొందారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులు రంగంలో 25కు పైగానే వినూత్నమైన విషయాలను కనుగొని శాస్త్రవేత్తగా ఎంతో గొప్ప పేరు తెచ్చుకున్నారు. విక్టోరియాలోని ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎనర్జిటిక్ మెటీరియల్స్ అనే సంస్థకు వైస్ చాన్సలర్‌గా వ్యవహరిస్తూ సైన్స్ రంగంలో నెల్లూరుకీర్తిని మరింతగా ఇనుమడింపజేస్తున్న దశలో ఆయన మరణించడం ఎంతో బాధకరం. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా ప్రఖ్యాతి పొందినా ఆయనెంతో నిరాడంబరంగా జీవిస్తూ నెల్లూరులో సైకిల్‌మీదనే తిరిగేవారు. ఎంతో స్నేహశీలి, మృదుస్వభావి, తన ప్రతిభాపాటవాలతో విశ్వవిఖ్యాతిని పొందిన శాస్త్రవేత్త డా. జగదీష్ ఆకస్మిక మృతికి చింతిస్తూ, ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది..'లాయర్'!...

### ఉప రాష్ట్రపతి సంతాపం :

ఉన్నతమైన ప్రతిభ కలిగిన డా.ఏ.జగదీష్ తమ జీవితం మొత్తాన్ని పరిశోధనకే అంకితం చేశారని, సామాన్య ప్రజలకు శాస్త్రీయ విజ్ఞాన ఫలాలు అతి తక్కువ వ్యయానికి అందించాలనే ఆకాంక్షతో వారి పరిశోధనలు సాగాయని, గొప్ప శాస్త్రవేత్తగా, నాయుడమ్మ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్న ఆయన ఎంతో నిరాడంబరంగా జీవితం గడిపి అందరికీ ఆదర్శనీయులయ్యారని భారత ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఒక ప్రకటనలో డా. జగదీష్ మృతికి సంతాపం ప్రకటించారు.

# గాల్లో ప్రాణాలు.. క్యూలో శవాలు

(3వ పేజీ తరువాయి)

అలసత్వానికి, ఆయా ఆసుపత్రుల పరిసరాల ప్రభావానికి చాలా ప్రాణాలు పోతున్నాయి. ఇక ప్రైవేటు ఆసుపత్రుల ధన దాహాన్ని తట్టుకోలేక కొన్ని గుండెలు ఆగిపోతున్నాయి. అనవసరంగా ఆసుపత్రుల చుట్టూ పరిగెత్తకుండా, నిపుణులైన డాక్టర్ల సలహాతో ఇంట్లోనే ఉండి వైద్యం చేసుకోవచ్చు. చాలా సర్వేల ప్రకారం అధిక శాతం మంది అసలు పరీక్షలు చేయించుకోకుండానే... తమకు లక్షణాలు కనపడిన వెంటనే వైద్యుల సలహాతో ట్రీట్‌మెంట్ మొదలు పెట్టుకుంటున్నారు. తమకు తామే హోమ్ ఐసోలేషన్‌లో ఉంటూ సొంత వైద్యం చేసుకుని కోలుకుంటున్నారు. కాబట్టి ఆందోళన చెందకుండా, లక్షణాలు కనిపించాయని తెలియగానే హైరానా పడకుండా తమకు తామే ధైర్యం చెప్పుకుంటే కరోనా మనల్ని ఏమీ చెయ్యలేదన్న విషయం ఇప్పటికే ఆ మాయదారి బారినపడ్డ ఎంతోమంది రుజువు చేశారు.

### జిల్లాలో లక్షకు చేరువగా కేసులు...

దాదాపు 33 లక్షలకుపైగా జనాభా ఉన్న నెల్లూరు జిల్లాలో బుధవారం(మే5) నాటికి అందిన సమాచారం ప్రకారం జిల్లా వ్యాప్తంగా 86,986 మందికి ఈ వ్యాధి సోకినట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. వీరిలో 636మంది ఇప్పటివరకు తమ ప్రాణాలు కోల్పోయినట్లు కూడా అధికారులు ధృవీకరిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో 9 కోట్లకు పైగా ఉన్న జనాభాతో పోల్చి చూస్తే ఇప్పటివరకు 12,03,337 మందికి కరోనా సోకితే వీరిలో 8,374 మంది అసువులు బాశారు. మొత్తం జనాభాలో వ్యాధి సోకిన వారి శాతం, వారిలో ప్రాణాలు వదిలిన వారి శాతం పరిశీలిస్తే చాలా తక్కువ. ఇవి అధికారులిచ్చిన లెక్కలు. ప్రభుత్వ దృష్టికి రాకుండానే ఇంకా కొన్ని లక్షలమందికి వ్యాధి వచ్చి తగ్గిపోయి ఉంటుందని వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనిని బట్టి గమనిస్తే మనం ఎంత జాగ్రత్తగా ఉంటే ఈ వ్యాధి మనకు అంత దూరంగా ఉంటుందని స్పష్టమైపోతుంది. ఒకవేళ మనకి వ్యాధి సోకినా మనం భయానికి ఎంత దూరంగా వుంటే అంత తొందరగా ఇది మన దగ్గరనుండి పారిపోతుందన్నది కూడా రుజువయ్యింది. కాబట్టి మళ్ళీ మళ్ళీ చెప్తున్నాం, జాగ్రత్తలు తీసుకోండి, ధైర్యంగా ఉండండి, సంయమనంతో వ్యవహరించండి.

వీక్షణం - మంజీరెడ్డి

# తెర తీయగ రాదా!

ఉదయనిధి స్టాలిన్ తప్ప... ఈ ఎన్నికల్లో ఏ మేకప్ వీరుడైనా 'అధ్యక్షా!' అనడానికి అర్హత సాధించాడా? ఈ ఎన్నికల్లో తమిళనాట రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్న ఖుష్బూ, కమల్‌హాసన్ ఊహించని పరాజయాన్ని మూటకట్టుకున్నారు. కమల్‌హాసన్ అయితే నియోజకవర్గాన్ని ఎంచుకోవడంలో చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించాడు. తమిళనాడులో జాతీయ పార్టీలకు ఆదరణ పెద్దగా లేదని ఎప్పుడో గ్రహించాడు. యూపీఏ కూటమిలో డీఎంకే పోటీ చేయని స్థానం, ఎన్‌డీఏ కూటమిలో అన్నా డీఎంకే పోటీచేయని స్థానాన్ని ఎంచుకున్నాడు. కాంగ్రెస్, బీజేపీలనైతే తీక్షణ దృక్కులతో మీసాన్ని మెలితిప్పుతూ నిలువరించవచ్చనుకున్నాడో ఏమో ఈ క్షత్రియ పుత్రుడు. కోయంబత్తూరు సౌత్ స్థానంలో పోటీ చేశాడు. 'మక్కల్ నీది మయ్యమ్ పార్టీ' 2018లో ప్రకటించాడు. పార్టీ పెట్టకముందే రాష్ట్రంలో క్షుణ్ణంగా సర్వే చేయించాడు కమల్. ఆ సర్వేలో కోయంబత్తూర్ సౌత్‌లో తన నాస్తికవాదాన్ని బలపరిచే ఓటర్లు ఉన్నారా లేదా అనే కోణంలో కూడా సర్వే చేయించుకున్నాడో లేదో మరి. చివరికి ఆస్తికత్వమే అస్తిత్వంగా మలచుకుంటూ మతతత్వ పార్టీగా ముద్ర వేసుకున్న బీజేపీ చేతిలో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

### థౌజండ్ లైట్స్... జీరో వాట్స్!

ఇక ఈ ఎన్నికల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సిన మరో సినీ పరిమళం ఖుష్బూ. ఆమె 2010లో డీఎంకేలో చేరింది, నాలుగేళ్లకు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంది. ఆ రెండు పార్టీలూ తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వలేదనేది ఆమె నిష్ఠూరం. దాంతో గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీలోకి మారింది. 'థౌజండ్ లైట్స్' నియోజకవర్గం కూడా ఆమె రాజకీయ జీవితంలో వెలుగును నింపలేకపోయింది.

### తెలుగు తెర తారలు

ఓ రెండేళ్లు వెనక్కి వెళ్తే మన రాష్ట్రంలో పవన్ కల్యాణ్ పరిస్థితి కూడా అంతే. రెండు చోట్ల పోటీ చేసినప్పటికీ ఏ నియోజకవర్గమూ ఆయన్ను అసెంబ్లీకి చేర్చలేకపోయింది. సినిమా నటులను తొలి ప్రయత్నంలో మాత్రం ఓటర్లు నిరాశపరచరు. గెలిపిస్తారు. ఆ విజయాన్ని నిలుపుకోవడం వారి రాజకీయ చతురతమీద ఆధారపడి ఉంటుందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో బలంగా ఉండేది. ఆ అభిప్రాయం కొన్నిసార్లు మాత్రమే నిజమవుతుందని, అన్నిసార్లూ వర్కవుట్ కాకపోవచ్చనే సందేహం చిరంజీవితోనే మొదలైంది. చిరంజీవి 2008లో పార్టీ పెట్టి తర్వాత ఏడాది ఎన్నికల్లో పోటీ చేశాడు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుతో పాటు ఎందుకైనా మంచిదని తిరుపతి అసెంబ్లీకి కూడా నామినేషన్ వేశాడు. తిరుపతి ఓటర్లు ఆదరించారు, పాలకొల్లులో విజయానికి దూరంగా ఉంచారు. సినిమా నటులను తొలిప్రయత్నంలో కూడా నిరాశపరుస్తారని తొలిసారిగా తెలిసింది అప్పుడే. అలా మొదలైన సినీ తారల అపజయాల పరంపర తమిళనాడు (2021) ఎన్నికల్లో బహిర్గతమైంది. సినిమా నటులంటే... ఒకప్పుడు ఎలా ఉండేదని?

### యాభై ఏళ్ల కిందటి మాట!

తమిళ ప్రజలు తెర మీద కనిపించని కరుణానిధిని ఆదరించారు, తెర మీద కనిపించిన ఎంజీఆర్‌ను అభిమానించారు. ఆ వారసత్వాన్ని అందుకున్న జయలలితనైతే ఏకంగా 'పురచ్చి తలైవి' అంటూ గుండెల్లో దాచుకున్నారు. రజనీకాంత్‌ని రారమ్మని పిలిచి పిలిచి నిరాశ చెందారు. విజయకాంత్‌ను సీఎంను చేయలేదు కానీ ప్రతిపక్షం వరకు అవకాశం ఇచ్చారు. అది కూడా జయలలిత సీఎంగా ఉండగా ప్రతిపక్షంలో ఆమెను ఢీకొట్టగలిగాడు విజయకాంత్. శరత్‌కుమార్ తొలి ప్రయత్నంతో డీఎంకే నుంచి పోటీ చేసి గెలుపుకు దూరంగా ఉండిపోయాడు. అయితే కరుణానిధి కరుణతో ఏకంగా రాజ్యసభలోనే అడుగుపెట్టాడు. తమిళనాడు అసెంబ్లీ కల నెరవేరాలంటే జయలలిత చల్లని చూపుతోనే సాధ్యమనుకున్నాడో ఏమో ఏఐఏడీఎంకే కూటమిలో చేరి అసెంబ్లీలో అడుగుపెట్టగలిగాడు, ఇక మన దగ్గర ఎన్టీఆర్ ఒక ప్రభంజనమే సృష్టించాడు. అదే అడుగుజాడల్లో రాజకీయ రంగు వేసుకున్న సూపర్ స్టార్ కృష్ణను తెలుగువాళ్లు తొలి ప్రయత్నంలో గెలిపించారు. కోట శ్రీనివాసరావు, బాబూమోహన్ కూడా సినీగ్లామర్‌తో చట్టసభలో అడుగుపెట్టినవాళ్లే. జయప్రద అయితే సినీ కెరీర్‌లాగానే పొలిటికల్ కెరీర్‌ని కూడా దక్షిణాదిలో మొదలుపెట్టి ఉత్తరాదికి చేర్చుకుంది. కానీ ఆమె తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు.

### ఆ క్రేజ్ ఏమైంది?

సినీ గ్లామర్‌ను ఓట్ల రూపంలో మార్చగలిగిన నాయకత్వం నేడు లోపించిందా? లేక సినీ గ్లామర్ పట్ల జనానికి వెగటు పుట్టిందా? ఈ ఎన్నికల్లో విజయం సాధించి అసెంబ్లీలో 'అధ్యక్షా!' అనే సంబోధనార్హత సాధించిన ఉదయనిధిని తమిళ ప్రజలు స్టార్‌గా చూడడం లేదు. తమిళనాడు అగ్రనేతగా రాణించిన కరుణానిధి మనుమడిగా, స్టాలిన్ కుమారుడుగా తమిళనాట ఒక పటిష్టమైన రాజకీయ సామ్రాజ్యానికి వారసుడిగానే గుర్తిస్తున్నారు. స్టాలిన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలనే వాళ్ల కోరికను తీర్చుకోవడంలో భాగంగానే ఉదయనిధిని గెలిపించారు తప్ప సినీ గ్లామర్‌ను ఆదరించడం కాదు. ఏది ఏమైనా సామాన్యుడి తెలివి పెరిగింది. విశ్లేషణ స్థాయి పెరిగింది. ఆర్కే లక్ష్మణ్ కార్టూన్‌లో ధోవతి కట్టుకుని కనిపించే సామాన్యుడు ఇప్పుడు జీన్స్ ప్యాంటు, టీ షర్టులోకి మారిపోయాడు. ఈ తరం సామాన్యుడి చేతిలో ప్రపంచం స్మార్ట్‌గా ఒదిగి పోయింది. ఇక ఇప్పుడు సామాన్యుడు సినీగ్లామర్ ఆదరణను తెరకుమాత్రమే పరిమితం చేయదలుచుకున్నట్లున్నాడు.

### బుధవారం నుండి సెమి లాక్‌డౌన్..



బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుండి కర్ఫ్యూ అమలులోకి రావడంతో నిర్మానుష్యంగా మారిన నెల్లూరు గాంధీ బొమ్మ కూడలి

మే 5వతేదీ నుండి ఆంధ్రా ప్రభుత్వం కఠిన నిబంధనలతో రాష్ట్రంలో సెమి లాక్‌డౌన్ విధించింది. ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే దుకాణాల తెరిచి ఉంచడంతో పాటు, ప్రజలు కూడా బయట తిరగడానికి అనుమతి ఇచ్చింది. ఆ సమయంలో కూడా జనాభా ఎక్కువగా గుమిగూడకుండా 144వ సెక్షన్ విధించింది. మధ్యాహ్నం 12 నుండి పక్కరోజు ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ విధించింది. సెమి లాక్‌డౌన్ తరహాలో వున్న ఈ నిబంధనలు ప్రస్తుతానికి 15 రోజులు అమలులో ఉంటాయని ప్రకటించింది. ఇప్పటికే పలు రాష్ట్రాలు ఇదే బాటపట్టాయి. ఇలాంటి విధానాలను అమలు చేశాకే ఆయా రాష్ట్రాల కేసులు తగ్గుముఖం పట్టాయని నిపుణులు చెప్తున్నారు. మే 15వతేదీ నాటికి కేసులు అత్యధికం అవుతాయని, మే15 నుండి క్రమేణా తగ్గడం మొదలై నెలాఖరుకంతా దాదాపుగా సాధారణ పరిస్థితులు నెలకొంటాయని కొంతమంది అంచనా వేస్తున్నారు. ఈ మాయదారి మహమ్మారి ఇంకా ఎంతకాలం పట్టి పీడిస్తుందో, ఎన్ని ప్రాణాలను పొట్టన పెట్టుకుంటుందో చూడాలి. సాధ్యమైనంత త్వరలో ఈ రోగం అంతరించి పోవాలని ఆ సర్వేశ్వరుడికి పూజలు చేద్దాం, అల్లాని ప్రార్థిద్దాం, ప్రభువుని వేడుకుందాం..! సర్వేజనా సుఖినోభవంతు!



# అమ్మకు అంజలి

## శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ

02.05.1951 - 10.05.2016

అమ్మను మించిన దైవం లేదు...
అమ్మ ప్రేమను మించిన అమృతం లేదు...
అమ్మను మరపించే బంధం లేదు!

5వ వర్ధంతి సందర్భంగా...

అమ్మ జ్ఞాపకాలతో...

కుమారుడు
పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com